నేడు జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి సవిత పర్యటన

కడప కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో పాల్గొనే నిమిత్తం జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖా మంత్రి సవిత సోమవారం జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. 8వ తేదీ ఉదయం 6 గంటలకు పెనుగొండ నుంచి బయలుదేరి 9-30 గంటలకు ప్రొద్దుటూరులోని దొరసానిపల్లెకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1గంట వరకు అక్కడ జరిగే రెవెన్యూ సదస్సుల్లో పాల్గొంటారు. అక్కడ నుంచి బయిలుదేరి మధ్యాహ్నం 1-45 గంటలకు కమలాపురం మండలంలోని చిన్నచెప్పలి గ్రామానికి చేరుకుంటారు. 2 గంటల నుంచి సాయంత్రం 5 గంట లవరకు అక్కడ జరిగే రెవెన్యూ సదస్సులో మంత్రి పాల్గొంటారు. ఆ తరువాత రాత్రి 9-25 గంటల వరకు రిజర్వులో ఉండి.. అక్కడ నుంచి 9-40 గంటలకు జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌కు చేరుకుని విజయవాడకు రైలులో బయిలుదేరి వెళతారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల తనిఖీ

- పైలెట్ ప్రాజెక్టుగా లక్ష్మీపేట ఎంపిక
- పక్క మండలాల సిబ్బందితో విచారణ

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సామాజిక భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పథకం లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో దివ్యాంగులు, ఇతర కేటగిరిల్లో అనర్హులు లబ్ధి పొందుతన్నారని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల తనిఖీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా జిల్లాలోని చాపాడు మండలం లక్ష్మీపేట గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ సచివాలయ పరిధిలో 264 మంది వృద్ధాప్య పింఛన్లు, 48 మంది దివ్యాంగులు, 65 మంది వితంతువులు, 12 మంది ఒంటరి మహిళలు, 10 మంది అభయహస్తం పింఛన్లు పొందుతుండగా.. ఒక డయాలసిస్ పేషంటు కూడా పింఛను అందుకుంటున్నారు. మొత్తం మీద ఈ గ్రామంలో 400 మంది పింఛను పొందుతున్నారు. వీరిలో ఎంతమంది వాస్తవంగా అర్హులనే అంశంపై సోమవారం ఆ గ్రామంలో విచారణ చేపట్టనున్నారు. ఇందుకోసం గతంలో చాపాడు మండలంలో పనిచేసిన సిబ్బంది కాకుండా పక్క మండలాల సిబ్బందిని నియమించనున్నారు. దువ్వూరు మండలం నుంచి ఇరువురు, రాజుపాలెం నుంచి ఇరువురు, మైదుకూరు నుంచి ముగ్గురు, ప్రొద్దుటూరు నుంచి మరో ముగ్గరితో కలిసి పది మందితో ఒక బృందాన్ని నియమించారు. వీరిలో ఒక్కొక్కరు 40 పింఛన్ల అర్హతను నిర్ధారించనున్నారు.

ఎంపీ అవినాష్ పీఏ రాఘవరెడ్డికి నోటీసు


రాఘవరెడ్డికి నోటీసులు అందజేస్తున్న దృశ్యం

పులివెందుల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డికి పులివెందుల పోలీసులు నోటీసు అందించారు. ఆదివారం సాయంత్రం రాఘవరెడ్డి ఇంటికెళ్లి నోటీసులు అందించారు. ఎస్సీ, ఎస్టీ కేసు, సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులపైన విచారణకు హాజరు కావాలని 41 నోటీసును అందించారు. గతంలో 41 నోటీసు రాఘవరెడ్డికి పోలీసులు అందించారు. కానీ అప్పటికే రాఘవరెడ్డి పోలీసులు అరెస్టు చేస్తారనే విషయం తెలుసుకొని పరారీలో ఉన్నాడు. శనివారం రాత్రి రాఘవరెడ్డి పులివెందులకు వచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు నోటీసు అందించారు.

అమాత్యా.. ఆలకించరా?

- దురాక్రమణల్లో జెడ్‌హెచ్‌డీసీ భూములు
- అన్యాక్రాంతమవుతున్న వేలాది ఎకరాలు
- భూములు దళితులవి.. సాగులో ఇతరులు
- ప్రేక్షకపాత్రలో అధికార యంత్రాంగాలు
- రెవెన్యూ సదస్సుల్లో అయినా వెలుగు చూసేనా ?


మైదుకూరు మండలంలో జెడ్‌హెచ్‌డీసీ భూముల్లో సాగు చేసిన పంటలు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కేటాయించిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. కొన్ని దశాబ్దాల క్రితం ప్రభుత్వం జిల్లా హరిజన డెవలప్‌మెంటు కార్పొరేషన్ (జెడ్‌హెచ్ డీసీ)కి కొన్ని వేల ఎకరాల భూములు కేటాయించింది. ఈ భూములను ఎస్సీలలో అర్హులైన వారికి పంపిణీ చేసి తద్వారా వారిలో ఆర్థిక పరిపుష్టిని కల్పించేందుకు గతంలో అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. అయితే పేదల కోసం కేటాయించిన భూములను వివిధ మార్గాల్లో ఇతర వర్గాలకు చెందిన వారు చేజిక్కించుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. పట్టించుకోవాల్సి అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. దీంతో పేదలు తమ భూములు తమకు దక్కేలా చూడాలని వేడుకుంటున్నారు.

ఉమ్మడి కడప జిల్లాకు సంబంధించి 3505.74 ఎకరాలు కేటాయించి.. ఈ భూములను 1916 మందికి సాగుకు అనుమతిచ్చారు. ఇందులో పూర్వపు రాజంపేట రెవెన్యూ డివిజనులో 980 మంది 2090.69 ఎకరాలు, కడప రెవెన్యూ డివిజనులో 661 మందికి 2032.25 ఎకరాలు, జమ్మలమడుగు 275 మందికి 482.80 ఎకరాలు పంపిణీ చేశారు. అనమతి పొందిన రైతులు కొంతకాలం పాటు ఆ భూముల్లో పంటలు సాగు చేసుకున్నారు. అయితే ప్రకృతి వైపరీత్యాల వల్ల పలు సందర్భాల్లో నష్టం వాటిల్లింది. దీంతో పంటల సాగు వారికి కష్టతరంగా మారింది. ఆ సామాజిక వర్గంలో అత్యధికంగా నిరుపేదలే ఉండడంతో నష్టాలు ఓర్చుకుని పంటలు సాగు చేయడం ఇబ్బందిగా మారింది. దీంతో తమకు కేటాయించిన భూములను బీడుగా వదిలేసే పరిస్థితికి వచ్చారు. ఇదే అదనుగా కొంత మంది ఇతర సామాజిక వర్గాల వారు ఎస్సీలకు తృణమో పణమో ముట్టజెప్పి ఆ భూములు స్వాధీనం చేసుకున్నారు. దశాబ్దాల కాలంలగా ఆ భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఉద్దేశ్యం నీరుగారిపోతుంది. భూముల పంపిణీ తరువాత జెడ్‌హెచ్‌డీసీ అధికారులు అటు వైపు చూడడం కానీ, రైతులకు ఆర్థిక సాయం చేయడం కానీ చేయకపోవడంతో భూములు వదలుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని కొంత మంది బాధిత కుటుంబీకులు చెబుతున్నారు. సుదీర్ఘకాలం ఇతర సామాజిక వర్గాల వారే జెడ్‌హెచ్‌సీ భూములో పంటలు సాగు చేస్తుండడంతో గతంలో భూమి పొందిన వ్యక్తుల పిల్లలు నేడు వారి భూముల్లోనే వారు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల తమ పెద్దలు ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లిస్తాం, తమ భూములు తమకు ఇవ్వమంటూ అడిగినప్పటికీ గతంలో కొనుగోలు చేసిన వారు ససేమిరా అంటున్నారు. అయితే రికార్డుల్లో మాత్రం జెడ్‌హెచ్‌డీసీ భూములుగానే చూపుతున్నాయి. కేవలం గతంలో లబ్ధి పొందినవారి నుంచి అగ్రిమెంటు ద్వారా భూమిని పొందినవారు ఇప్పుడు ఆ భూములు వదలుకునేందుకు సిద్ధంగా లేరు. ఈ క్రమంలో కొంత మంది ఎస్సీ కార్పరేషన్ కార్యాలయం చుట్టూ పలు దఫాలుగా కాళ్లరిగేలా తిరిగినప్పటికీ ప్రయోజనం లేదు. ఆ భూములు ఎప్పుడో ఎవరికో కేటాయించారని.. అందుకు సంబంధించిన సమగ్ర సమాచారం తమ వద్ద లేదని.. తాము ఏమీ చేయలేమని ఎస్సీ కార్పోరేషన్ సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఏం చేయాలో దిక్కుతెలియక నిస్సహాయ స్థితిలో వెనుదిరిగి వెళుతున్న పరిస్థితి ఉంది. కొన్ని చోట్ల రెవెన్యూ అధికారులు ఈ భూములకు సంబంధించి అనుమతులు ఇచ్చినట్లు కూడా సమాచారం ఉంది.

ఎస్సీల భూముల్లో ఇతరుల సాగు


జిల్లా హరిజన డెవలప్‌మెంటు కార్పోరేషన్‌కు సంబంధించిన భూములు అర్హులైన వారికి పంపిణీ చేశారు. అయితే ఈ భూములను పొందిన వారికి పట్టాలకు బదులుగా పర్మిషన్ మాత్రమే ఇచ్చినట్లు తెలుస్తుంది. ఆ విధమైన అనుమతి పొందిన కొంత మంది కారుచౌకగా తమ భూములను తనఖా పెట్టుకుని విడిపించుకోలేక వదలి వేయడం జరిగింది. దీంతో చాలా మంది ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారు ఇప్పటికీ దళితుల భూములను అనుభవిస్తున్నారు. దాదాపు దశాబ్దాల క్రితం నుంచి ఈ తంతు జరుగుతోంది. కొంత వరకు ఆర్థికంగా బలోపేతమైన భూమి లబ్ధిదారుని కుటుంబసభ్యులు తమ అప్పులు చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ సాగులో ఉన్న వారు సహకరించకపోవంతో ప్రయోజనం లేకుండా పోతుంది. ఖాజీపేట మండలంలోని చెముళ్లపల్లె భూముల్లో ఎక్కువ భాగం ఇతర సామాజిక వర్గాల వారే అనుభవిస్తున్నట్లు తెలుస్తుంది. చాపాడు మండలం వెదురూరులో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఇక్కడ కూడా ఎక్కువమంది భూములను ఇతర సామాజిక వర్గాల వారు అనుభవిస్తున్నారు. అదే విధంగా మైదుకూరు మండలంలో కూడా ఈ పరిస్థితి ఉన్నట్లు స్పష్టమవుతుంది. పేదల ప్రజల కోసం ఎన్నో సంక్షేమపథకాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న రెవెన్యూ సదస్సులో అధికార యంత్రాంగం ఇలాంటి వాటిపై దృష్టి సారించి పేదలకు సాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలో జెడ్‌హెచ్‌డీసీ భూముల పంపిణీ వివరాలు

- పుల్లంపేట మండలంలో 104 మందికి 223.96 ఎకరాలు ఎకరాలు కేటాయించారు.
- ఓబులవారిపల్లె మండలంలో పెద్ద ఓరంపాడులో 63 మందికి 192.52 ఎకరాలు, చిన్నఓరంపాడులో 43 మందికి 54.69 ఎకరాలు, చిన్నఓరంపాడులోని రెండో కాలనీలో 36 మందికి 71.43 ఎకరాలు,
- కోడూరు మండలంలో తాడివాండ్లపల్లెలో 43 మందికి 44.21 ఎకరాలు, ఉప్పరపల్లెలో 61 మందికి 91.50 ఎకరాలు.
- అట్లూరు మండలం ముత్తుకూరులో 97 మందికి 159.87 ఎకరాలు.
- గోపవరం మండలంలో మడకలవారిపల్లెలో 30 మందికి 65.37 ఎకరాలు
- నందలూరు మండలంలో ఆడపూరులో 30 మందికి 96 ఎకరాలు
- చిట్వేలు మండలంలో చెర్లోపల్లెలో 34 మందికి 123.16 ఎకరాలు, మైలపల్లిలో 80 మందికి 246.76 ఎకరాలు
- పోరుమామిళ్ల మండలం ఎల్లాపల్లిలో 50 మందికి 98.86 ఎకరాలు, టి.చల్లగిరిగెలలో 109 మందికి 133 ఎకరాలు
- ఖాజీపేట మండలం చెముళ్లపల్లె, సంజీవనగర్‌లలో 158 మందికి 150.4 ఎకరాలు
- సంబేపల్లె మండలంలో మోటకట్లలో 108 మందికి 324 ఎకరాలు, వల్లూరు మండలంలో పెద్దలేబాకలో 75 మందికి 74.6 ఎకరాలు,
- కమలాపురం మండలం సంబటూరులో 99 మందికి 153.6 ఎకరాలు, దాదిరెడ్డి పల్లెలో 84 మందికి 97.91 ఎకరాలు, కె.అప్పాయపల్లెలో 137 మందికి 132.28 ఎకరాలు
- చాపాడు మండలం వెదురూరులో 191 మందికి 114.6 ఎకరాలు, కొండాపురం మండలం ఎర్రగుడిలో 30 మందికి 41 ఎకరాలు, మైదుకూరు మండలంలో వరదాయపల్లెలో 79 మందికి 135.4 ఎకరాలు, గాంధినగర్‌లో 37 మందికి 49.5 ఎక రాలు, కొత్తగంగవరంలో 22మందికి 44.28 ఎకరాలు నంద్యాలంపేటలో 107 మందికి 212.62 ఎకరాలు కేటాయించారు.

చీనీ చెట్లకు.. తెగుళ్లు

- సస్యరక్షణ చర్యలు చేపట్టినా అదుపుకాక..
- గిట్టుబాటు ధరలు లేక..
- చెట్లను తొలగిస్తున్న రైతులు



చీనీచెట్లను నరికేస్తున్న కూలీలు, (ఇన్‌సెట్లో) ఇప్పట్లలో తొలగించిన చీనీ చెట్లలో మేకల, గొర్రెల మంద

లింగాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చీనీ చెట్లకు వ్యాపిస్తున్న తెగుళ్ల రైతుల పాలిటశాపంలా మారుతున్నాయి. తెగుళ్లను అదుపుచేసేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో చేసేది లేక చీనీ చెట్లను తొలగిస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చీనీ చెట్లకు బంకకారు, వేరుకుళ్ల తెగుళ్ల, పులుసుపురుగు, ఆకులపై రసంపీల్చే నల్లి వ్యాపించడం వంటి ప్రధాన సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. వీటి నివారణకు రైతులు ఎన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టినా అదుపులోకి రావడం లేదు. తెగుళ్లను అదుపుచేసేందుకు రైతులు ఎక్కువగా మందులను ఉపయోగించడం వలన చెట్లపై అవి దుష్ప్రభావం చూపుతున్నాయి. దీంతో ఆశించినస్థాయిలో దిగుబడులు రాకపోవడం, పెట్టుబడుల వ్యయం పెరగడం, ధరలు స్థిరంగా లేకపోవడం వంటి పరిణామాలతో రైతులు చీనీ సాగుకు దూరం అవుతున్నారు. లింగాల మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో చీనీ సాగు అవుతుండేది. గత కొన్ని నెలల్లో సుమారు 1500 ఎకరాల్లో రైతులు చీనీ చెట్లను తొలగించారు.


చీనీ కొమ్మలను పొట్టులా మారుస్తున్న యంత్రం

తెగుళ్లు అదుపుకాక.. చెట్లను తొలగిస్తున్నాం



ఎనిమిదేళ్ల క్రితం 15 ఎకరాలలో చీనీ సాగు చేపట్టాను. చీనీ చెట్ల ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చునని ఎంతో ఆశించా. కానీ ప్రతికూల వాతావరణ పరిస్థితులలో నిత్యం చీనీ తోటలకు ఏదోక తెగుళ్ల సోకుతున్నాయి. ఎంతో వ్యయం చేసి సస్యరక్షణ చర్యలు చేపట్టినా ఉపయోగం లేకుండా పోతోంది. దీనికి తోడు ధరలు స్థిరంగా ఉండడం లేదు. దిగుబడులున్న సమయంలో ధరలు పతనం అవుతాయి. ధరలున్న సమయంలో దిగుబడులు ఉండవు. ప్రస్తుతం చీనీ సాగు గిట్టుబాటు అయ్యే పరిస్థతు లేవు. తాను ఇంత వరకు సుమారు రూ.20లక్షలపైనే పెట్టుబడి పెట్టాను. ఎనిమిదేళ్ల నుంచి ఎటువంటి ఆదాయం లేదు. తప్పని పరిస్థితులలో చీనీ చెట్లను తొలగించాల్సి వచ్చింది.

-వెంగల్‌రెడ్డి, రైతు, లింగాల మండలం

రైతులు తొందరపడి చెట్లను తొలగించవద్దు



చీనీ సాగులో ప్రస్తుతం అధికంగా సమస్యలున్న మాట వాస్తవమే. కానీ సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా సమస్యలను అధిగమించాలి. ఎక్కువ మంది రైతులు జంబేర మీద అంటుకట్టిన చీనీ మొక్కలు నాటుతున్నారు. అవి తెగుళ్ల ఉధృతి తట్టుకొని నిలబడలేవు. రంగపూర్ మీద అంటుకట్టిన మొక్కలను నాటుకోవాలి. అలాగే రైతులు తెగుళ్లను అదుపు చేసేందుకు సింథటిక్ పైరిత్రోయిడ్ మందులను వాడుతున్నారు. అవి అప్పటికప్పుడు పనిచేసినా భవిష్యత్తులో తెగుళ్ల ఉధృతి మరింత పెరిగి చాలా నష్టం చేకూరుతుంది. తెగుళ్లతో చనిపోతున్నాయని చాలా మంది రైతులు చీనీ చెట్లను తొలగిస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా మన దిగుబడులు మహారాష్ట్ర దిగుబడులు ఒకేసారి మార్కెట్‌కు రావడంతో ధరలు ఆశాజనకంగా లేవు. రైతులు తొందరపడ చీనీ తోటలను తొలగించవద్దు. భవిష్యత్‌లో ధరలు ఆశాజనకంగా ఉంటాయి.

-రాఘవేంద్రరెడ్డి, ఉద్యాన అధికారి, పులివెందుల

తప్పుడు సమాచారాన్ని ట్రోల్ చేస్తే కఠిన చర్యలు

- మీడియా సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తే కఠిన చర్యలు తప్పవని, ఇక్కడ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి ఇతర దేశాలకు పారిపోవాలని చూస్తే వారి పాస్‌పోర్టులు సీజ్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు. ఆదివారం ఆయన రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈనెల 5వ తేదీ రాయచోటి పట్టణంలో రాత్రి 7 నుంచి 8 గంటల సమయంలో సుమారు 200 మందితో అయ్యప్పస్వాములు గ్రామోత్సవం చేసుకుంటూ రాణా సర్కిల్ వైపు రావడంతో మసీదు దగ్గర కొంతమంది స్లోగన్స్ ఇవ్వడంతో అభ్యంతరం తెలిపారన్నారు. అప్పటికే అక్కడ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆ ప్రాంతంలో పెద్దలు లేకపోవడం, యువకులు స్లోగన్‌లు చేయడం వలన ఈ సున్నిత అంశం ఏర్పడిందన్నారు. తప్పుడు సమాచారాన్ని ట్రోల్ చేసిన వారిని వదిలిపెట్టమని చెప్పారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశంలో ఇరువర్గాల పెద్దలతో మాట్లాడి ఒక అవగాహనకు వచ్చినట్లు తెలిపారు. కొందరు ఆకతాయిలు అయ్యప్పస్వాములు వెళుతున్న బస్సుపై చేతులతో కొట్టడం వలన అద్దం మాత్రం పగిలిందని వారిని గుర్తిస్తున్నామన్నారు. అంతేగానీ రాయచోటిలో హిందువులు- ముస్లింలు కొట్టుకోలేదని, మా దగ్గర ఉన్న దృశ్యాలను పరీక్షించగా ఎప్పుడో జరిగిన సంఘటనలు కూడా కొన్ని కలిపేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారని అలాంటి వారిని వదిలిపెట్టమన్నారు. కడప నగరంలోని పెద్ద దర్గాకు హిందువులు వస్తుంటారని, తిరుమలకు ముస్లింలు వెళుతుంటారని, ప్రగాఢమైన నమ్మకాలతో ప్రజలు జీవిస్తున్నారని, అందరూ కలిసి మెలిసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారని, కొందరు ఆకతాయిలు మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఇలాంటి తప్పుడు సమాచారం ఇచ్చే వారి గురించి మీకు తెలిస్తే పోలీసు శాఖకు తెలియజేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ పేర్కొన్నారు.

నేడు సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కడప కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా సోమవారం నుంచి కలెక్టరేట్ ఆవరణలోని సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలు నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని, ఇక నుంచి ప్రజల సౌకర్యార్థం సభాభవన్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు.

220 రేషన్ బియ్యం బస్తాలు పట్టివేత

- ఐచర్ వాహనం సీజ్
- యజమాని, డ్రైవర్ అరెస్టు

ప్రొద్దుటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పట్టణంలోని మడూరు రోడ్డు సర్కిల్ వద్ద బియ్యాన్ని తరలిస్తున్న ఐచర్ వాహనాన్ని రూరల్ ఎస్‌ఐ మహ్మద్‌రఫీ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ఈ వాహనంలో దాదాపు 220 రేషన్ బియ్యం బస్తాలు వున్నట్లు గుర్తించారు. వీటిని ప్రొద్దుటూరు నుంచి కర్ణాటకకు తరలిస్తున్నట్లు వాహన యజమాని రామాంజనేయులు, డ్రైవర్ వర్రా సునీల్ విచారణలో వెల్లడించినట్లు తెలిపారు. ఈ అక్రమ రవాణాలో కీలకంగా వున్న తాటి శరత్, నరేంద్రలతో పాటు ఐచర్ వాహన యజమాని రామాంజనేయులు, డ్రైవరు వర్రా సునీల్‌పై రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి పోరాడుదాం

- అఖిలపక్ష నాయకుల పిలుపు


సంఘీభావం తెలుపుతున్న అఖిలపక్షం నాయకులు

కడపఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే విధంగా పోరాటాలు సాగిద్దామని అఖిలపక్ష కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దసరథరామిరెడ్డి, జేవీవీ నాయకుడు వాసుతో పాటు వివిధ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం జరిగిన సదస్సులో వారు మాట్లాడారు. విభజన చట్టం ప్రకారం కడప జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన ఉక్కు పరిశ్రమ కోసం ఏ ఒక్క పార్టీ కూడా చిత్తశుద్ధితో కృషి చేయడం లేదన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పడితే ప్రత్యక్షంగా పరోక్షంగా లక్ష మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. ఇప్పటికే ఉక్కుపరిశ్రమకు మూడు ప్రాంతాల్లో భూమిపూజ జరిగినా నిర్మాణం జరగకపోవడం బాధాకరమన్నారు. రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల అభివృద్ధి జరిగే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు శ్రీనివాసులు, రమణయ్య, అశోక్, గోపాల్‌రెడ్డి, ప్రసాద్, నగిలి గుర్రప్ప, సుబ్బరాయుడు, జయవర్ధన్, శంకర్, పెద్దారెడ్డి, అంజి, దస్తగిరి, రాజేంద్ర ప్రసాద్, శివారెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



విశాఖలో పారాగ్లైడింగ్

» విజయవంతమైన ట్రయల్‌రన్

సాగర్‌నగర్ (విశాఖపట్నం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరాన్ని సందర్శించే పర్యాటకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేందుకు రుషికొండ బీచ్‌లో పారాగ్లైడింగ్ అందుబాటులోకి రానుంది. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో లెవెన్ అడ్వెంచర్స్ సంస్థ ఆదివారం నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఈ బీచ్‌లో ఇప్పటికే బోటుషికార్, స్కూబా డైవింగ్ తదితర అడ్వెంచర్స్ స్పోర్ట్స్ అందుబాటులో వున్నాయి. పారాగ్లైడింగ్ కొత్త అనుభూతిని అందించనుంది. నింగి, నేలను తాకుతూ సముద్రంలో ఎగసిపడే కెరటాలు... మరో పక్క ఎత్తైన కొండలను వీక్షిస్తూ నీలాకాశంలో విహరించడం పర్యాటకులకు మధురానుభూతిని స్తుందని నిర్వాహకులు చెబుతున్నారు.

అనంత పోలీసుల కస్టడీలో బోరుగడ్డ

విచారణలో 'తెలియదు, గుర్తులేదు..' సమాధానాలు



అనంతపురం క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను అనంతపురం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న ఆయన్ను ఆదివారం తెల్లవారుజామున అనంతపురం తీసుకొచ్చారు. సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులను అసభ్యకరంగా విమర్శిస్తూ బోరుగడ్డ యూట్యూబ్ చానల్‌లో మాట్లాడారని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజశ్విని నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ నిమిత్తం బోరుగడ్డను కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి కోర్టు నుంచి మూడు రోజుల కస్టడీ కోరారు. శనివారం అతనికి వైద్య పరీక్షలు అక్కడే నిర్వహించారు. కాగా, బోరుగడ్డ విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన్ను తెల్లవారుజామున 1.20 గంటల సమయంలో పోలీసుస్టేషన్‌కు తీసుకురాగా.. అప్పటికే అక్కడి లైట్లన్నీ ఆర్పేశారు. వచ్చీ రాగానే అనిల్‌ను లోపలకు తీసుకెళ్లారు. ఆదివారం సైతం పోలీసుస్టేషన్‌కు తాళం వేశారు.

విచారణకు సహకరించని అనిల్

విచారణలో అనిల్ పోలీసులకు సహకరించలేదని సమాచారం. 'తెలియదు.. పెద్దగా గుర్తులేదు..' అనే సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఆదివారం అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో విచారించారు. వీడియోల ఎదుట స్టేట్‌మెంట్‌ను తీసుకున్నట్లు తెలిసింది. అనిల్ గతంలో మాట్లాడిన వీడియోల ఆధారంగా 'నువ్వే కదా ఈ వీడియోలో మాట్లాడింది' అని ప్రశ్నించినట్లు తెలిసింది. 3 రోజుల కస్టడీ తర్వాత అతనికి సోమవారం సాయంత్రం వైద్య పరీక్షలు నిర్వహించి, స్థానిక కోర్టులో హాజరుపరిచిన తర్వాత రాజమండ్రి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రయాణ సమయాన్ని చూపి మంగళవారం ఉదయం అక్కడి కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

» 11న రాయలసీమ, దక్షిణ కోస్తాలో వర్షాలు



విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం నాటికి స్థిరంగా కొనసాగుతోంది. దీనిపై ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉండగా, ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి సోమవారం నాటికి తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. తరువాత కూడా పశ్చిమ వాయవ్యంగా పయనించి ఈనెల 11వ తేదీనాటికి శ్రీలంక, తమిళనాడు తీరాలకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించనుంది. దీని ప్రభావంతో 11వ తేదీన రాయలసీమలో విస్తారంగా, దక్షిణ కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆదివారం కోస్తా, రాయలసీమలో ఎక్కువ ప్రాంతాల్లో మేఘాలు ఆవరించి చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

అన్నదాతలను అప్రమత్తం చేయాలి: కలెక్టర్లకు సీఎం ఆదేశాలు

అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కల్లాల్లో ధాన్యం తడవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వరి కోతలు వాయిదా వేసుకునేలా అన్నదాతలను అప్రమత్తం చేయాలని ఆదివారం రాత్రి కలెక్టర్లు, జేసీలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రైతులు నూర్చిన ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వరికుప్పలు, ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు రైతులు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని వ్యవసాయశాఖను ఆదేశించారు.

వెనక'బడి'ంది!



» ఒక్క పాఠశాలకూ దక్కని 5 స్టార్ రేటింగ్

» నాలుగు స్టార్లు దక్కిన బడులూ తక్కువే

» ఏకంగా 398 బడులకు జీరో స్టార్ రేటింగ్

» సర్కారు స్కూళ్లలో సదుపాయాల లేమి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో చాలాచోట్ల మౌలిక సదుపాయాలు ఉంటే సరైన ఫలితాలు లేవు. అభ్యసన ఫలితాలు బాగున్న చోట సదుపాయాలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. కొన్నిచోట్ల అసలు ఈ రెండూ లేవు. అటు మౌలిక సదుపాయాలు, ఇటు ఫలితాల్లో అత్యుత్తమంగా నిలిచిన బడి రాష్ట్రంలో ఒక్కటీ లేదు. కూటమి ప్రభుత్వం తాజాగా చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెలుగు చూసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ బడుల స్థితిగతులను తెలుసుకునేందుకు మౌలిక సదుపాయాలు, అభ్యసన ఫలితాల (లెర్నింగ్ అవుట్‌కమ్స్)కు ప్రభుత్వం స్టార్ రేటింగ్‌ను ప్రకటించింది. ఏ బడి ఏ స్థాయిలో ఉంది? అనే కోణంలో వివరాలు సేకరించడంతో ఇప్పటివరకూ వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రచారం అంతా ఉత్తదేనని తేలిపోయింది. బడుల్లో మౌలిక సదుపాయాలకు 5 స్టార్లు, అభ్యసన ఫలితాలకు 5 స్టార్లు ప్రామాణికంగా ఈ అధ్యయనం నిర్వహించారు. రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 45,087 ఉంటే... వాటిలో ఏ ఒక్కటి కూడా కనీసం ఒక విభాగంలోనూ ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. మరోవైపు సదుపాయాల్లో 87, అభ్యసన ఫలితాల్లో 311 బడులకు అసలు రేటింగే దక్కని (జీరో రేటింగ్) దారుణమైన స్థితిలో ఉన్నాయి.

> విద్యారంగంలో సంస్కరణల పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసం పాఠశాలలను దీన స్థితిలోకి నెట్టేసింది. చదువులను గాలికొదిలి టోఫెల్, బైజూస్, సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ సిలబస్ అంటూ చేసిన ప్రయోగాలు విద్యా ప్రమాణాలను దారుణంగా దెబ్బతీశాయి. విద్యార్థుల హాజరు, ఫలితాలను పట్టించుకోకుండా టీచర్లకు బోధనేతర బాధ్యతలు అప్పగించడంతో పాటు బోధన సమయాన్ని తగ్గించడంతో పిల్లల చదువులు అటకెక్కాయి. 'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలల స్వరూపమే మార్చేస్తామని ప్రగల్భాలు పలికినా.. ఆ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో బడుల్లో మౌలిక సదుపాయాలూ అంతంతమాత్రంగానే ఉన్నాయని తేలిపోయింది. గత ప్రభుత్వం తీరుతో ఇప్పుడు పాఠశాలలు సింగిల్ స్టార్ దక్కించుకోవడానికే ఆపసోపాలు పడుతున్నాయి.

సొంత భజనతో సరి

రాష్ట్రంలోని ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్లు గత వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రచారం చేసుకుంది. 'నాడు- నేడు'తో బడి స్వరూపాన్ని మార్చేశామని జగన్ పదే పదే సొంత భజన చేసుకున్నారు. తీరా ఇప్పుడు మౌలిక సదుపాయాల విభాగంలో ఒక్క పాఠశాల కూడా ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. అదేవిధంగా అభ్యసన ఫలితాల్లో సైతం ఒక్కటీ ఫైవ్ స్టార్ సాధించకపోగా, కేవలం 41 పాఠశాలలు మాత్రమే ఫోర్ స్టార్ సాధించాయి. మిగిలిన 45 వేల పైచిలుకు బడులన్నీ త్రీ స్టార్, అంతకంటే తక్కువ స్థాయికే పరిమితమయ్యాయి.

స్టార్ రేటింగ్ ఇలా...

మౌలిక సదుపాయాల విభాగంలో రేటింగ్ కోసం 18 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. బడిలో మరుగుదొడ్లు, ల్యాబ్‌లు, క్రీడా మైదానం, ప్రహరీ, గ్రంథాలయం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, తరగతి గదులు, తాగునీరు తదితరాలను పరిశీలించారు. ఒక్కో అంశానికి 5 చొప్పున గ్రేడింగ్ ఇచ్చారు. వీటిలో 90 శాతం గ్రేడింగ్ సాధించిన బడులకు 5 స్టార్లు కేటాయించారు. 30 కంటే తక్కువ ఉంటే ఒక స్టార్ ఇచ్చారు. అభ్యసన ఫలితాల విభాగంలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, గతేడాది పదో తరగతి పరీక్షల ఫలితాలు, ఇటీవల జరిగిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను, ఒకవేళ పదో తరగతి లేకపోతే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను ప్రామాణికంగా తీసుకున్నారు. ఈ నాలుగు విభాగాల్లో హాజరుకు 40 శాతం, ఫలితాలకు 60 శాతం గ్రేడింగ్ ఇచ్చారు. రెండూ కలిపి 90 శాతం దాటిన బడులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. అంతకంటే తక్కువ ఫలితాలున్న బడులకు 1 నుంచి 4 స్టార్లు కేటాయించారు.

అన్ని జిల్లాల్లోనూ అదే తీరు

ప్రభుత్వ పాఠశాలల స్థితి దాదాపుగా అన్ని జిల్లాల్లోనూ ఒకేలా ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ జిల్లాలో 2,913 బడులకు గాను 161 చోట్ల మాత్రమే మౌలిక సదుపాయాలు ఫరవాలేదన్నట్టుగా ఉన్నాయి. అయితే అభ్యసన ఫలితాలు మాత్రం దిగజారిపోయాయి. ఈ విభాగంలో ఒక్క బడి కూడా నాలుగు స్టార్లు సాధించలేదు. అనకాపల్లి, అనంతపురం, బాపట్ల, కాకినాడ, కర్నూలు, ఎన్టీఆర్, నెల్లూరు, శ్రీసత్యసాయి, విశాఖ జిల్లాల్లోనూ ఒక్క పాఠశాలకూ నాలుగు స్టార్లు దక్కలేదు. ఎక్కువ పాఠశాలలు రెండు, మూడు స్టార్లతోనే సరిపెట్టుకున్నాయి.

బడులకు ఇచ్చిన రేటింగ్‌లు ఇలా..

స్టార్ రేటింగ్	మౌలిక సదుపాయాలు	అభ్యసన ఫలితాలు
జీరో స్టార్	87	311
ఒక్క స్టార్	1,958	14,095
టూ స్టార్	16,816	26,272
త్రీ స్టార్	19,438	4,368
ఫోర్ స్టార్	6,788	41
ఫైవ్ స్టార్	0	0

ఫలితాల్లేని సదుపాయాలెందుకు?

వైసీపీ ప్రభుత్వం బడులను రాజకీయ ప్రచారానికి వాడుకుంది. విద్యార్థుల హాజరు, వారి పరీక్షల ఫలితాలను గాలికొదిలేసింది. నాడు-నేడు పేరుతో బడులకు రంగులు, కుర్చీలు, బెంచీలు అంటూ బోధనను నిర్లక్ష్యం చేసింది. టీచర్లకు నాడు- నేడు పనులు, మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతలు అప్పగించి బోధన సమయాన్ని తగ్గించింది. దీనిపై అప్పట్లో ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టారు. కానీ జగన్ ప్రభుత్వం వారి ఆందోళనలను పెడచెవిన పెట్టింది. పాఠశాల విద్య అంటే నాడు-నేడు పథకం ఒక్కటేనన్నట్టుగా మార్చేసి, ఫలితాలను దిగజార్చింది.

నవ్య | చిత్రజ్యోతి

పోరాట వీరుడి కథ



విజయ్ సేతుపతి, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'విడుదల-2'. ఈనెల 20న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. నిర్మాత చింతపల్లి రామారావు ఈ చిత్ర తెలుగు హక్కులను దక్కించుకున్నారు. కాగా, ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను కథానాయకుడు విజయ్ సేతుపతి చెన్నైలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'పెరుమాళ్ అనే పాత్రలో విజయ్ సేతుపతి అభినయం ఈ చిత్రానికి హైలెట్‌గా ఉండబోతోంది. పెరుమాళ్ పోరాట వీరుడిగా ఎలా మారాడు అనేది ఎంతో ఆసక్తికరంగా ఈ చిత్రంలో వెట్రిమారన్ ప్రజెంట్ చేశారు. తెలుగులో విజయ్ సేతుపతికి ఎందరో అభిమానులు ఉన్నారు. ఈ చిత్రంలో ఎమోషన్స్, యాక్షన్ అన్నీ రియాల్టీకి దగ్గరగా ఉంటాయి. ఇళయరాజా సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా ఉంటుంది' అని అన్నారు. మంజువారియర్, సూరి, భవాని శ్రీ, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సూర్య సేతుపతి, అనురాగ్ కశ్యప్, రాజీవ్ మీనన్ తదితరులు ఈ చిత్రంలో నటించారు. కాగా, గతేడాది రిలీజైన 'విడుదల' పార్ట్ 1 చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకొని సూపర్ హిట్‌గా నిలిచింది.

యాక్షన్ థ్రిల్లర్



పూర్వజ్ దర్శకత్వం వహిస్తూ హీరోగా నటిస్తున్న చిత్రం 'కిల్లర్'. పూర్వజ్, ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. ఈ మూవీ ఫస్ట్ షెడ్యూల్‌ను హైదరాబాద్, వికారాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. 10 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో హీరో పూర్వజ్, హీరోయిన్ జ్యోతి పూర్వజ్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొన్నారు. ప్రస్తుతం రెండో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో మరో హీరో విశాల్ రాజ్ పాల్గొంటారు. రామోజీ ఫిల్మ్ సిటీ, మొయినాబాద్ లొకేషన్స్‌లో జరిగే ఈ చిత్రీకరణలో గౌతమ్, జ్యోతి పూర్వజ్ పాల్గొంటారు.

డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్



తెలుగు ఫిల్మ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్ ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రకాశ్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. అధ్యక్షుడిగా ప్రకాశ్ ఎన్నికవడం ఇది ఐదోసారి. కాగా, జానీని అధ్యక్షుడిగా తొలగించడంతో పాటు ఆయన సభ్యత్వాన్ని కూడా రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జానీపై పోక్సో కేసు విచారణలో ఉండటం, అసోసియేషన్‌లో జానీ ప్రవర్తన అగ్రెసివ్‌గా ఉండేదనే రిపోర్టు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

మోహన్‌బాబు.. మనోజ్ మధ్య గొడవ?





సినీ నటుడు మంచు మోహన్‌బాబుకు ఆయన చిన్న కొడుకు మనోజ్‌కు మధ్య ఆస్తుల పంపకాల విషయంలో గొడవ జరిగినట్లు మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ విషయం సినీ ఇండస్ట్రీతో పాటు.. అభిమానుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పహాడీషరీఫ్ పరిధిలోని మోహన్‌బాబు ఇంట్లో ఆస్తుల పంపిణీ జరుగుతున్న క్రమంలో స్కూలుకు సంబంధించిన వాటాల్లో విభేదాలు తలెత్తి మోహన్‌బాబు అనుచరులు వినయ్ ఇతర బౌన్సర్లు మనోజ్‌పై, ఆయన భార్య మౌనికపై దాడికి పాల్పడి గాయపరిచినట్లు.. గాయాలతోనే మనోజ్ తన భార్యతో కలసి పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ విషయమై మహేశ్వరం డీసీపీని సంప్రదించగా డయల్-100కు కాల్ వచ్చిందని, వ్యక్తిగతంగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. కాలుకు గాయం అయిన మంచు మనోజ్ తన భార్య మౌనికతో కలసి బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చారు. తండ్రితో జరిగిన గొడవ విషయమై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. మనోజ్, మౌనిక మాట్లాడటానికి నిరాకరించారు. కాగా, మనోజ్ ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో డిశ్చార్జి అయ్యారు. మనోజ్‌కు ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేసు) పూర్తి చేసిన వైద్యులు ఆయన ఒంటిపై అనుమానాస్పద దెబ్బలు ఉండటంతో ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాలు, మెడ భాగంలో గాయాలైనట్లు వైద్యులు నిర్ధారించారని తెలిసింది. సిటీ స్కాన్, అల్ట్రా సౌండ్ పరీక్షలు పూర్తి చేసిన వైద్యులు 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉండాలని సూచించగా.. సోమవారం మరోసారి ఆస్పత్రికి వస్తానని మనోజ్ డిశ్చార్జి అయినట్లు తెలిసింది.

అంతా అబద్ధం : మోహన్‌బాబు

ఆస్తుల పంపకాల్లో మా ఇంట్లో గొడవలు జరిగాయని.. మనోజ్‌ను నేను కొట్టానని ఉదయం నుంచి మీడియాలో షికార్లు చేస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని మోహన్‌బాబు తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. నిజానిజాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు చేయొద్దంటూ మీడియాకు సూచించారు.

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

14న ఎన్టీఆర్ సినీ ప్రస్థాన వజ్రోత్సవం



నందమూరి తారకరామారావు సినీ ప్రస్థాన వజ్రోత్సవం ఈ నెల 14న పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో జరుగుతుందని ఆయన కుమారుడు నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల ఛైర్మన్ టీడీ జనార్ధన్ పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఫిల్మ్ ఛాంబర్ హాల్లో ఆదివారం ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో టీడీ జనార్ధన్ మాట్లాడుతూ "సినీ, రాజకీయ రంగంలో ఎన్టీఆర్‌కు సాటి లేదు. కృష్ణుడిగా, రాముడిగా నటించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన తొలిసారి నటించిన 'మనదేశం' చిత్రం 75 ఏళ్లు అయిన సందర్భంగా ఈ వేడుకను ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, 'మనదేశం' చిత్ర నిర్మాత కృష్ణవేణి, దర్శకుడు ఎల్వీ ప్రసాద్ కుమారుడు రమేశ్ ప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో పాటు పలువురు చిత్ర పరిశ్రమ ప్రముఖులు పాల్గొంటారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌తో పాటు 24 క్రాఫ్ట్‌తో పాటు తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది" అని అన్నారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, సెక్రటరీ దామోదర్ ప్రసాద్, ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు అనుపమరెడ్డి, ఈసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

- ధర్నాచౌక్, విజయవాడ (ఆంధ్రజ్యోతి)

ఒక్కసారి ప్రేమిస్తే చాలు




బాలీవుడ్ సీనియర్ నటి రేఖ రీసెంట్‌గా ఓ రియాల్టీ షోలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక అంశాలను పంచుకున్నారు. జీవితంలో ఒక్కసారి మాత్రమే ప్రేమలో పడతారని కవులు తమ రచనల్లో రాస్తే...మరికొందరు మాత్రం ప్రేమకు ఆది, అంతం లేదంటున్నారు. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి అని యాంకర్ రేఖను ప్రశ్నించగా..'నా మటుకు, ఆ వ్యక్తి సరైన వాడైతే... ఒక్కసారి ప్రేమిస్తే చాలు' అని బదులిచ్చారు. మరో ప్రశ్నకు సమాధానంగా నిజమైన ప్రేమకు నిర్వచనం చెబుతూ 'ఎవరినైనా ప్రేమించండి, నా వరకైతే నేను మొదట అన్నిటినీ ప్రేమిస్తాను. నా వృత్తిని, నా స్నేహితులను, ఈ ప్రపంచాన్ని, ప్రకృతిని ఇలా...ప్రతీదాన్ని ప్రేమిస్తాను. కానీ, నన్ను నేను ఎక్కువగా ప్రేమిస్తా' అని చెప్పుకొచ్చారు. రేఖ మాటలు విన్న ప్రేక్షకులు ప్రశంసల జల్లు కురిపించారు.



మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి

ఇటీవలే 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ప్రస్తుతం ఆమె మరో వెబ్ సిరీస్ 'రక్త్‌బ్రహ్మాండ్'లో నటిస్తున్నారు. 'ద బ్లడీ కింగ్‌డమ్' అనేది ఉపశీర్షిక. తాజాగా, కొద్ది గ్యాప్ తర్వాత ఈ సిరీస్ సెట్స్‌లోకి ఆమె తిరిగి అడుగుపెట్టారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. బ్యాక్ టూ యాక్షన్ మోడ్ అని పేర్కొన్నారు. 2018లో విడుదలైన హారర్ చిత్రం 'తుమ్‌బాడ్'తో గుర్తింపు తెచ్చుకున్న అనిల్ బార్వే దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్యాంటసీ వెబ్‌సిరీస్‌ను రాజ్ అండ్ డీకే నిర్మిస్తున్నారు. ఈ నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌లో ఆదిత్యరాయ్ కపూర్, అలీ ఫాజల్, వామికా గబ్బీ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



అరకులో మాస్ జాతర

రవితేజ నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' అనేది ట్యాగ్‌లైన్. 'సామజవరగమన' రచయిత భాను భోగవరపు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ ఆఫీసర్ పాత్రలో రవితేజ నటిస్తున్నారని వార్తలొస్తున్నాయి. సినిమా తాజా షెడ్యూల్ డిసెంబరు మూడో వారంలో అరకులో ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఆ తరవాత పాడేరు, ఆంధ్రా-ఒడిషా సరిహద్దు లొకేషన్స్‌లో చిత్రీకరణ జరగనున్నట్లు తెలిసింది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్, నవీన్ చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అసత్య ప్రచారాన్ని ఆపండి

- రెహమాన్ కుమార్తె ఖతీజా



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన భార్య సైనా బానుతో విడిపోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయనపై పలు ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు రెహమాన్ కుటుంబ సభ్యులు తిప్పికొడుతూనే ఉన్నారు. అయితే రీసెంట్‌గా మరో వార్త వైరల్ అవుతోంది. వైవాహిక బంధానికి స్వస్తి పలికిన రెహమాన్.సంగీతానికి కొంత కాలం దూరంగా ఉండనున్నారంటూ కోలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. రెహమాన్ మ్యూజిక్‌ని మిస్ అవ్వాల్సిందేనా? అంటూ సోషల్ మీడియాలో ఆయన అభిమానులు పోస్టులు పెట్టారు. ఈ వార్తలపై ఇప్పటికే రెహమాన్ కుమార్తె ఖతీజా 'ఎక్స్' వేదికగా స్పందించారు. అయినా రూమర్లు ఆగకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మరోసారి రియాక్ట్ అయ్యారు. 'దయచేసి అసత్య ప్రచారాన్ని ఆపండి' అని విజ్ఞప్తి చేశారు. వార్తను ప్రచురించిన ఓ మీడియాను కోట్ చేస్తూ అలా రాయడం సబబు కాదన్నారు.

అధ్యాపక జిల్లా సంఘం ఎన్నిక ఏకగ్రీవం


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

కలికిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల జిల్లా సంఘం (జీసీటీఏ) ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఆదివారం స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ ఆవరణలో జీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మలిగి రాఘవ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జి. వెంకట కృష్ణయ్య పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. అన్నమయ్య జిల్లా పరిధి బీటీ కళాశాల (మదనపల్లె), ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (మదనపల్లె), ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (వాయల్పాడు), సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పీలేరు), ఎస్ డబ్ల్యు మహిళా రెసిడెన్షియల్ కళాశాల (కలకిరి), కోడూరు, రాజంపేట, రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, రాయచోటి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల ఆఫీస్ బేరర్లు, ప్రాథమిక సభ్యులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షురాలిగా జె.మోహనల్లి (జీడీసీ ఉమెన్స్, మదనపల్లె), కార్యదర్శిగా డాక్టర్ కె.శ్రీనివాసులు రెడ్డి (ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీలేరు), మహిళా కార్యదర్శిగా డాక్టర్ ఎస్.గులాబ్‌జాన్ (మహిళా రెసిడెన్షియల్ కళాశాల, కలికిరి), కోశాధికారిగా బి.కిరణ్‌కుమార్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాయచోటి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా నూతన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ డి.శ్రీనివాసులు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు.

గుంజననదిలో శవం లభ్యం

కన్నెగుంట గిరిజన కాలనీ వాసిగా గుర్తింపు


పీరయ్య శవాన్ని వెలికితీస్తున్న బంధువులు

రైల్వేకోడూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గుంజననదిలో ఆదివారం ఓ శవం లభ్యమైంది. విచారిస్తే కన్నెగుంట గిరిజన కాలనీ వాసి తుపాకుల పీరయ్య (70)గా గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి.... ఈ నెల 6న రెడ్డివారిపల్లె సమీపంలోని ఓ రైతు మామిడి తోటలో కాపలా ఉంటున్న తన కుమార్తెను చూసేందుకు పీరయ్య గుర్రపాళెం గిరిజన కాలనీ మీదుగా వెళ్లాలని రైల్వేకోడూరుకు వచ్చారు. పట్టణంలోని వెంకయ్యస్వామి ఆలయం సమీప నదిని దాటుకుని గుర్రప్పపాళెం గిరిజన కాలనీకి వెళ్లాల్సి ఉంటుంది. నది ప్రవాహంలో ఉందని తెలియక దిగేశాడు. దీంతో ప్రవాహంలో కొట్టుకుపోయాడు. అప్పటి నుంచి కనిపించని పీరయ్యను బంధువులు వెతుకుతుండగా చిట్వేలి రూటులో ఉన్న గుంజననదిలో శవమై తేలాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు రైల్వేకోడూరు చేరుకుని శవాన్ని కన్నెగుంట గిరిజన కాలనీకి తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు



రాజంపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లెలో నిర్మలాదేవి(48) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు మన్నూరు ఇన్‌చార్జి సీఐ ఎల్లమరాజు తెలిపారు. తాళ్లపాక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నాగేశ్వరనాయక్ భార్య నిర్మలాదేవి శనివారం ఉదయం మరణించింది. అయితే గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు చేయడానికి ఓ వాహనాన్ని ఏర్పాటు చేయడంతో స్థానికులకు విషయం తెలిసింది. దీంతో కొందరు పోలీసులు, మీడియాకు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా భర్తపైనే అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో మీడియా ప్రతినిధులు అక్కడికి వెళ్లి ఈ సంఘటనను ఫొటోలు తీస్తుండగా మీడియా ప్రతినిధులపై ఉపాధ్యాయుడు బంధువులు దాడి చేయడానికి ప్రయత్నించారు. సెల్‌ఫోన్లను లాక్కుని కిందపడేసి పగులగొట్టడానికి ప్రయత్నించారు. ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి అక్కడికి చేరుకుని వివరాలు అడుగుతుండగా ఎస్ఐపై కూడా టీచర్ బంధువులు వాగ్వాదానికి దిగారు. వెంటనే సీఐ ఎల్లమరాజు జోక్యం చేసుకుని విషయాన్ని డీఎస్పీకి తెలిపి ఈ మృతిపై అనుమానాస్పద స్థితిలో కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి భర్త నాగేశ్వరనాయక్‌పై గతంలో అనేక ఆరోపణలు ఉండడం గమనార్హం. ఈయన అనేక పాఠశాలల్లో పనిచేస్తుండగా విద్యార్థినులను వేధింపులకు గురి చేశారన్న అభియోగంపై పోలీసుస్టేషన్లలో కూడా ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయమై సీఐను వివరణ కోరగా ఈ మృతిపై ఉన్నతాధికారులకు తెలిపి పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టును బట్టి నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వ అలసత్వం

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి


ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్.తులసిరెడ్డి విమర్శించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చేది గోరంత, లాక్కునేది కొండంతగా పాలన సాగుతోందని విమర్శించారు. ఉచితగ్యాస్ పథకం ద్వారా ఏడాదికి రూ.2,624 కోట్లు ఖర్చు కాగా కరెంటు సర్దుబాటు చార్జీలపేరుతో రూ.15,485 కోట్లను ప్రజల నుంచి ప్రభుత్వం దోచుకుంటోందని విమర్శించారు. ఊరూరా బెల్టుషాపులు ఉన్నా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఉచిత ఇసుక విధానం ప్రజలకు భారంగా మారిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆడవాళ్లకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీ - వ్యక్తికి గాయాలు

సిద్దవటం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లారీ, బైక్ ఢీకొనడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే... కడప - చెన్నై జాతీయ రహదారిపై బొగ్గిడివారిపల్లె వాసి సురేష్‌కుమార్‌రెడ్డి బైక్‌పై వెళుతున్నాడు. ఇంతలో పూణె నుంచి చెన్నైకి వెళుతున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో తలకు బలమైన గాయాలు తగలగడంతో 108లో వైద్య పరీక్షలకు కడప రిమ్స్‌కు స్థానికులు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు విచారిస్తున్నారు.


భగవద్గీతను పఠించాలి

భక్తి వికాసస్వామి మహరాజ్



ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత జీవనానికి ప్రతి ఒక్కరూ భగవద్గీతను పఠించాలని శ్రీమద్ భక్తివికాసస్వామి పేర్కొన్నారు. ఆదివారం ఇస్కాన్ మందిరంలో భగవద్గీతపై ఆయన ప్రవచనాలు వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతను చదవడం వలన లాభం, మంచి నడవడిక అలవడుతాయన్నారు. కాగా సోమవారం ఉదయం 8 గంటలకు ఇస్కాన్, సాయంత్రం 6 గంటలలకు బొల్లవరం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద స్వామివారి ప్రచనాలు ఉంటాయని, ఇస్కాన్ నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో దీక్షా గురువు శ్రీదండి సన్యాని భక్తి వికాస స్వామి శిక్ష గురువు శ్రీమద్ మదిరేసుదాసు, భక్తులు పాల్గొన్నారు.

వేదపారాయణం... లోక కల్యాణం



- ● వేద విద్యను బోధిస్తున్న శైవాగమ వేద పాఠశాల
- ● ప్రముఖ ఆలయాల్లో అర్చకులుగా రాణిస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు వేదాలు తోడ్పడతాయి. సంస్కృతీ సంప్రదాయాలను కాపాడే వేదాలన్నా, అర్చకులన్నా ప్రజల్లో ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. కేవలం పూజలు నిర్వహించడం అర్చకుల విధి. స్వామివారికి అర్చనలు, అభిషేకం, కల్యాణం వంటి పూజా కార్యక్రమాల నిర్వహణ గురించి వేదాలు బోధిస్తాయి. వేదాలు అభ్యసించిన అర్చకులు పూజలు నిర్వహించగలరు. వేద విద్యను నేర్పించడానికి అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆదిశైవాగమ వేద పాఠశాలలు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో శివునికి అర్చనలు మొదలు విగ్రహా ప్రతిష్ఠ వరకు అన్ని రకాల కైంకర్యాల గురించి విద్యార్థులకు నేర్పిస్తారు. రాష్ట్రంలో శైవాగమంలో వేద విద్యను అందిస్తున్న ఏకైక పాఠశాల. 1982లో ప్రారంభమైన వేద పాఠశాల నిధుల కొరతతో రెండుసార్లు మూతపడింది. 1997 నుంచి నిరాటంకంగా కొనసాగుతోంది. రాయలసీమ జిల్లాలు సహా తెలంగాణ విద్యార్థులు ఇక్కడ వేద విద్యను చదువుతున్నారు. ప్రస్తుతం వేద పాఠశాలలో 24 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆలయం వద్ద వేద పాఠశాల విద్యార్థులకోసం ప్రత్యేక భవనం నిర్మించారు.


విద్యార్థులకు వేద విద్యను బోధిస్తున్న దృశ్యం

ఆరేళ్ల విద్యాబోధన

శైవాగమ వేద పాఠశాలలో ఆరేళ్లు వేద విద్యను బోధిస్తారు. 5వ తరగతి చదివి 12 నుంచి 18 ఏళ్లలోపు వారు వేద విద్యకు అర్హులు. వీరికి ప్రవేశ, వర, ప్రవర విభాగాలుగా విభజించి బోధన కొనసాగిస్తారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైతేనే పైతరగతులకు పంపుతారు. విద్యార్థులకు వేద విద్య, భోజన వసతిని ఉచితంగా అందజేశారు. విద్యార్థులకు అవసరమైన నిత్యావసర వస్తువులను నెలకొకసారి ఉచితంగా ఇస్తారు. దేవదాయ శాఖ సీఎన్‌జీ నిధులు, అగస్త్యేశ్వరస్వామి ఆలయం నిధులతో వేద పాఠశాల కొనసాగుతోంది. సీఎంజీ నిధులు రాకపోవడంతో ఆలయ నిధుల ద్వారా వేద పాఠశాల అవసరాలు తీరుస్తున్నారు అధికారులు.

విద్యార్థుల దినచర్య

ఉదయం 5 గంటల నుంచి ప్రారంభం అవుతుంది. యోగా చేసి స్నానపానాదులు ముగిసిన తర్వాత శివునికి సుప్రభాత సేవ నిర్వహిస్తారు. 7.30 గంటలకు సంధ్యావందనం నిర్వహించి గంట పాటు స్టడీ అవర్స్ నిర్వహిస్తారు. అల్పాహారం తీసుకున్న తర్వాత 9 నుంచి 12 గంటల వరకు విద్యాబోధన కొనసాగుతుంది. 12.30 గంటలకు సంధ్యావందనం, భోజనం ఉంటుంది. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తరగతులు కొనసాగుతాయి. సాయంత్రం 6 గంటలకు సంధ్యావందనం చేసి 6.30 నుంచి 8 గంటల వరకు స్టడీ కొనసాగుతుంది. 8.30 గంటలకు భోజనం తిని నిద్రకు ఉపక్రమిస్తారు.

వేద విద్య అభ్యసించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తారు. దీంతో విద్యార్థులు ఎక్కడైనా అర్చకత్వం చేసుకునే అవకాశం ఉంటుంది. ఇక్కడ వేద విద్య అభ్యసించిన వారు రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో అర్చకులుగా విధులు నిర్వహిస్తున్నారు. కర్ణాటక సహా ఇతర రాష్ట్రాల్లోని పెద్ద పెద్ద ఆలయాల్లో అర్చకులుగా పనిచేస్తున్నారు.

సీఎన్‌జీ నిధులు మంజూరు చేయాలి



వేద పాఠశాల నిర్వహణకు నెలకు రూ.90 వేలు ఖర్చు అవుతోంది. దేవదాయశాఖ నుంచి రూ.40 లక్షల సీఎన్‌జీ నిధులు రావాల్సి ఉంది. అధికారులకు లేఖ రాసినా స్పందించడంలేదు. ఆ నిధులు కేటాయిస్తే విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించవచ్చు.

కొత్తమిద్దె రఘురామిరెడ్డి, శివాలయం చైర్మన్

వేద విద్యను కాపాడుకోవాలి



విలువైన వేద విద్యను అంతరించిపోకుండా కాపాడుకోవాలి. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు వేద విద్య దోహదపడుతుంది. మానవునికి మాధవుడికి అనుసంధాన కర్తగా వ్యవహరించడమే అర్చకుల విధి. వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం పాటుపడాలి.

వి.వెంకటేష్‌శర్మ, గురువు

అర్చకునిగా రాణిస్తా



అర్చకత్వంపై ఆసక్తితో వేద పాఠశాలలో చేరా. శిక్షణ పూర్తి చేసుకుని అర్చకత్వంలో రాణిస్తా. అర్చకత్వం, పూజలు, విధి విధానాల గురించి ఇక్కడ నేర్పిస్తున్నారు. పూర్తిగా నేర్చుకుని వేదాలను ఇతరులకు బోధిస్తూ నేర్చుకుంటే కలిగే ఫలితాలను వివరించి వారిలో చైతన్య తెస్తాను.

రాకేష్‌శర్మ, విద్యార్థి

విద్యావ్యవస్థను వైసీపీ సర్వనాశనం చేసింది

టీడీపీ అభివృద్ధి చేస్తుంటే వైసీపీ బురద చల్లే ప్రయత్నం

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యావ్యవస్థను వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివారెడ్డి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే వైసీపీ బురద చల్లే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. ఆదివారం శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని పరిస్థితులు టీడీపీ ప్రభుత్వం గాడినపెడుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. రాష్ట్రానికి గూగుల్, ఆపిల్‌లాంటి ఎన్నో సంస్థలు తీసుకువస్తున్నట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నేతలు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పేరెంట్స్ విద్యార్థుల సమావేశం ఒకపండుగ వాతావరణంలో జరగిందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని ఆరోపించారు. నాడు నేడు పేరుతో వైసీపీ నేతలు అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. అంజద్‌బాషా పరిస్థితి ప్రజలందరికీ తెలుసునన్నారు. అయితే ఎన్నికల సమయంలో అంజద్‌బాషాను చూసి కాదు నన్ను చూసి ఓట్లు వేయాలని జగన్ ప్రకటన అంజాద్ పరిస్థితి తెలుస్తుందన్నారు. కడపలో తాగునీటిసమస్య ఉండో, లేదో మాతో వస్తే మేం నిరూపిస్తామన్నారు. అంజద్‌బాషా చేసిన అవినీతి అక్రమాలు అన్నీ ఇన్నీ కావని ఆరోపించారు. ప్రతి కాంట్రాక్టులోనూ 8 శాతం కమీషన్లు తీసుకున్నారని సొంత పార్టీ కార్పొరేటర్లే లబోదిబో మంటున్న విషయం గుర్తు చేశారు. మినిస్టరు కాలనీలో ఎంతమంది మోసపోయారో చెప్పాలని ప్రశ్నించారు. గతంలో అంజాద్‌బాషా మాట్లాడిన మాటలకు నేనుకాక ఇంకెవరున్నా అంజద్‌బాషా, అతని తమ్ముడు అహ్మద్ బాషాను దున్నపోతు మీద ఊరేగిస్తారని మండిపడ్డారు. ప్రజా సమస్యలు మాట్లాడడానికి మా ప్రభుత్వం గళం విప్పుతుందని స్పష్టం చేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ఆరోపనలు చేసే ముందు వళ్లు దగ్గర పెట్టుకోవాలని మా కార్యకర్తలు సహనం కోల్పోతే తాను ఏమీ చేయలేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

రాయచోటిటౌన్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): స్థానిక రాయుడుకాలనీ వాసి , వివాహిత ఇంద్రజ (30) శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసు కథనం మేరకు వివరాల్లోకి వెళితే.... గాలివీడు రోడ్డులో నివాసం ఉంటున్న వెంకట్రమణ కుమార్తె ఇంద్రజను 15 ఏళ్ల కిందట కడప జిల్లా చెన్నూరులో వివాహం చేశారు. భార్యాభర్తలకు మనస్పర్థలు వచ్చి రెండేళ్లగా ఇంద్రజ ఇద్దరు కుమారులతో కలిసి రాయచోటిలోని రాయుడుకాలనీలో ఉంటోంది. ఈమె తండ్రి రెండేళ్ల కిందటే మృతి చెందాడు. ఈమె తల్లి ప్రస్తుతం గల్ఫ్ దేశమైన కువైత్‌లో ఉంది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ నరసింహారెడ్డి, సిబ్బంది సంఘటనపై విచారించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

వ్యక్తి అదృశ్యం - కేసు నమోదు


విజయకుమార్ పైల్ ఫొటో

కడప(క్రైం)డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆశోక్ నగర్ వాసి నల్లబల్లి విజయకుమార్ అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆశోక్ నగర్‌కు చెందిన విజయకుమార్ కేబుల్ అపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 7వతేదీ రాత్రి ఇంటిముందు బైకు సెల్ ఫోన్‌లు పెట్టి వెళ్లి పోయాడు. భార్య జగదీశ్వరి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపా రు. ఆచూకీ తెలిసిన వారు 9121100520. 9121100521. 9121100522 సమాచారం ఇవ్వలని కోరారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది ● వెనక్కు పంపిన వాహనాలు


పాములూరు గుట్ట వద్ద చదునుచేసిన ప్రభుత్వ భూమి

వేంపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాములూరు గుట్టలో ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుండగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. వేంపల్లె వాసి టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి ఎక్స్‌కవేటర్‌ను తీసుకెళ్లి భూమిని చదును చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది పనులు నిలిపివేయించి ఎక్స్‌కవేటర్‌ను పంపించారు. సుమారు రూ.40లక్షల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటుండగా అధికారులు ఆదివారం నిలిపిన ఘటన చోటుచేసుకుంది. అధికారులు, స్థానికుల సమాచారం మేరకు వివరాల్లోకెళితే...

వేంపల్లె సమీపంలోని పాములూరు గుట్ట కొండల మధ్యలో భూమిని ఆదివారం టీడీపీ నేత శేషారెడ్డి చదునుచేస్తుండగా తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. ఆయన ఆదేశాల ప్రకారం వీఆర్వో నాగేంద్ర పరిశీలించి సుమారు 5 నుంచి 8 ఎకరాల ప్రభుత్వ భూమిని చదునుచేసినట్లు గుర్తించారు. పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్నారు. పట్టా ఉన్నాయని చెబితే చూపాలని కోరగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఎక్స్‌కవేటర్‌ను, ఇతర వాహనాలను అక్కడి నుంచి పంపించారు. దీంతో అక్కడ సుమారు రూ.40లక్షల విలువైన 5 నుంచి 8 ఎకరాలు కబ్జాకు గురికాకుండా అధికారులు నిలువరించారు.

పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నాం

పాములూరు గుట్ట వద్ద 513 సర్వేనెంబర్‌లోని భూమి పట్టాలివ్వాలని కుటుంబ సభ్యులతో కలిసి దరఖాస్తు చేసుకున్నామని టీడీపీ నేత శేషారెడ్డి తెలిపారు. కొన్నేళ్లుగా ఆ భూమి తమ అధీనంలో సాగుచేసుకుంటున్నామని గతంలో పట్టా కోసం దరఖాస్తు చేసుకోగా కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వాలు తమ ఫైల్‌ను పక్కనపెట్టాయన్నారు. ప్రస్తుతం కలెక్టర్‌కు పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నాం, పట్టా ఇప్పించాలని అధికారులను కోరాము.

ఈ విషయంపై తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో చదునుచేస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో వెంటనే పనులు నిలిపివేయించామన్నారు. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా నిబంధనల మేరకు పట్టా పొంది ఉంటే రికార్డులు తీసుకురావాలని సూచించామన్నారు. రికార్డులు లేకుండా ప్రభుత్వ భూముల్లో పనులు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఉచితం పేరుతో దళారుల దోపిడీ


ట్రాక్టర్లను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఒంటిమిట్ట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక రవాణా ముసుగులో దళారులు ఇసుక అక్రమ రవాణాను పెద్దఎత్తున కొనసాగిస్తున్నారు. గొల్లపల్లెలో పెన్నానది నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసింది. అదే అదునుగా దళారులు రాత్రీ పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా చేపడుతున్నారు. క్వారీ వద్ద సచివాలయం సిబ్బంది ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పనిచేస్తున్నారు. ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రభుత్వానికి రూ.136 లోడింగ్ చార్జి చెల్లించి సచివాలయంలో పేర్లు నమోదు చేసుకుని తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీరితో పాటు గొల్లపల్లె పంచాయతీ ప్రజలకు ఉచితంగా ఇసుక రవాణా సరఫరా చేస్తారని, గొల్లపల్లె పంచాయతీ గ్రామస్థులు సచివాలయంలో తమ అవసరాల కోసం నమోదు చేసుకుని రసీదు పొందాలని అధికారులు తెలిపారు. వీటన్నింటినీ తుంగలో తొక్కి చుట్టుపక్కల మండలాల నుంచి కొందరు ట్రాక్టర్లు యజమానులు ఎలాంటి రసీదు లేకుండానే నేరుగా ఇసుకను పెద్ద ఎత్తున అక్రమ రవాణా చేపడుతున్నారు. నేరుగా నదిలోకి ట్రాక్టర్లను వెళ్లకుండా నదికి కిలోమీటరు దూరంలో డంపింగ్ కేంద్రంలో ఇసుకను డంపింగ్ చేసి అక్కడి నుంచి ప్రజలకు పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు. నదిలోకి ఎటువంటి ట్రాక్టర్లు వెళ్లకుండా పోలీసు పహారా ఏర్పాటు చేసి అనుమతి ఉన్న వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. ఉచిత ఇసుక ముసుగులో అక్రమ వ్యాపారం చేపట్టడం మండలంలో ఇసు క అక్రమ రవాణాపై విమర్శలు నెలకొన్నాయి.

డంపింగ్ కేంద్రంలో దొరకని ఇసుక

గొల్లపల్లె ఇసుక కేంద్రంలో ఇసుకను డంపింగ్ చేప ట్టి అక్కడి నుంచి వాహనాలకు లోడింగ్ ప్రక్రియను అధికారులు చేపట్టారు. కానీ 10 రోజులుగా డంపింగ్ కేంద్రంలో ఇసుకను తేలేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో అనుమతులు లేకుండానే నేరుగా ట్రాక్టర్లు నదిలోకి దిగి ఇసుకను అక్రమ రవాణా చేపడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇసుక అక్రమ రవాణా చేపడితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివారం దర్శిపల్లెలోని ఇసుక క్వారీలను పరిశీలించారు. ఆదివారం సచివాలయ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ట్రాక్టర్ల యజమానులు పెద్దఎత్తున ఎటువంటి రసీదు లేకుండానే నదిలోకి వెళ్లడంతో ఎస్ఐ తమ సిబ్బందితో వెళ్లి ఇసుకను అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని, సచివాలయంలో అనుమతి పొందిన వారికే ఇసుక రవాణా చేసుకోవాలని ఆయన సూచించారు.

రోడ్లు వేయరు.. మురుగు కాల్వలు కట్టరు



రుద్రభారతిపేటలో ఇళ్ల మధ్యనే పారుతున్న మురుగునీరు

● రుద్రభారతిపేట వాసుల ఆవేదన

చెన్నూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు మండలంలోని రుద్రభారతిపేటలో ఎన్నో ఏళ్లుగా సరైన రోడ్డు సౌకర్యం లేదు. మురుగు కాల్వలు లేవు. పదేళ్ల క్రితం రెండు వీధుల్లో సిమెంటు రోడ్లు వేశారేగాని ఆ తరువాత రోడ్లన్న మాటే లేదు. 2003లో అప్పటి టీడీపీ పాల నలో ఖలీల్‌బాషా మంత్రిగా ఉన్న సమయంలో రుద్రభారతిపేటలో సుమారు 540 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారు. అక్కడ క్రమేపీ ఇంటి నిర్మాణాలు జరిగాయి. అయితే మౌలిక వసతులు శూన్యమయ్యాయి. ఆ ప్రాంతంలో ప్రజలు 18 ఏళ్లుగా నివసిస్తున్నా నేటికీ సరైన రోడ్లు, మురుగు కాల్వలు లేవు. వర్షం కురిస్తే ఎక్కడ నీరు అక్కడే నిల్వచేరి మురుగుగా మారి కంపు కొడుతోంది. రోజుల తరబడి నీరు నిలిచి ఉండటంతో దోమలు పెరిగి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. రెండు వీధుల్లో మాత్రం రోడ్ల పనులు జరిగాయి తప్ప ఆ తరువాత పట్టించుకోలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వీధుల్లో వర్షం నీరు, ఇళ్లల్లోకి నుంచి వచ్చిన నీరు మురుగనీరు కాల్వల్లో ప్రవహిస్తోంది. నిధులు పూర్తిస్థాయిలో మంజూరు చేస్తే తప్ప రుద్రభారతిపేట సమస్యల నుండి గట్టెక్కే పరిస్థితి లేదు.



రుద్రభారతిపేటలో రోడ్డు లేని వీధి

ఇబ్బంది పడుతున్నా పట్టించుకోరు



ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కాపురం ఉంటున్నాం. వీధివీధినా మురుగు నీరే. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తేనే ప్రజాప్రతినిధులు పనులు చేస్తారు. గత ప్రభుత్వంలో స్పందన తక్కువే. అంతా మురుగుకంపు. చీకటి పడితే అడుగు తీసి బయట పెట్టలేని పరిస్థితి.

- ఉజ్జల మల్లమ్మ, రుద్రభారతి పేట, చెన్నూరు మండలం

నిధులు లేవంటున్నారు



ఎన్నో ఏళ్లుగా మా సమస్యలు చెబుతున్నాం. కార్పొరేటరు ఉమాదేవి సమస్యలు తీరుస్తామని చెబుతుంటుంది. రుద్రభారతి పేటకు పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేస్తేనే మా ప్రాంతం బాగుపడుతుంది. - డి.సుబ్బరాయుడు, రుద్రభారతిపేట

మెనూ పాటించేలా చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ



ఎస్సీ వసతి గృహంలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో మెనూ ప్రకారం ఆహారం ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ప్రకాశ్ నగర్ ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ బృందం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో హాస్టల్స్‌లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదని, అధికారులు దీనిపై విచారణ జరిపించి మెనూ సక్రమంగా అమలయ్యేట్లు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్‌ఐ నాయకులు మోహన్, వంశీ, నిత్య, సుమంత్ పాల్గొన్నారు.

చిత్రం చెప్పిన సమస్య

కమలాపురం బస్టాండుకు వెళ్లే దారి ఇలా మురుగునీటిమయమైంది. దర్గా ప్రహరీ వద్ద డ్రైనేజీలో నీరు బయటికి వస్తోంది. ఈ రహదారి మీదుగానే బాలికలు, బాలురు, ఉర్దూ పాఠశాలలు, అలాగే కాలేజీలకు, కోగటం గ్రామం మీదుగా ప్రొద్దుటూరుకు వెళ్లాలి. అలాగే వందల మంది ప్రయాణికులు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలి. అధికారులు నిత్యం ఈ దారిన వెళుతుంటారు. అయినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. - కమలాపురం రూరల్, (ఆంధ్రజ్యోతి)



వక్ఫ్‌బోర్డు సభ్యుడిగా దావూద్ బాషా



దావూద్ బాషాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యుడిగా సయ్యద్ దావూద్ బాషా నియమాకం కడప ముస్లింకు లభించిన గౌరవమని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ మాధవీ రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం ద్వారకనగర్ లోని శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులుగా నియమితుడైన దావూద్‌బాషాను ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, అందుకు ఎల్లవేళలా సహకారం అందిస్తామని తెలిపారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'సామాజిక బాధ్యత గల కవి ఈశ్వర్‌రెడ్డి'



ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న అభ్యుదయ వేదిక ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సామాజిక బాధ్యతగల కవి ప్రొఫెసరు ఎస్.ఈశ్వర్‌రెడ్డి అని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం గుంటూరు పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డికి 2024 తుమ్మల వెంకట్రామయ్య పురస్కారం అందించారు. సభకు అధ్యక్షత వహించిన పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటులో తుమ్మల వెంకట్రామయ్య నిర్మాణాత్మక పాత్ర పోషించారని, పీడితుల పక్షాన నిలబడి ప్రశ్నించారని అలాంటి రచయితలపై ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక సాహితీ పురస్కారం ప్రజాపక్షం వహించి రచనలు చేస్తున్న ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డికి ఇవ్వడం సముచితంగా ఉందన్నారు. ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గురజాడ ప్రారంభించిన మాత్రచందస్సులను ఆ కాలంలో చాలామంది కవులు అందిపుచ్చుకున్నారన్నారు. ఆధునిక సాహిత్య ప్రక్రియలైన వచన కవిత, కథ, నవల, నాటకం తదితర వాటితో గేయానికి శక్తి ఎక్కువగా ఉందన్నారు. అభ్యుదయ గేయాలు ప్రజలకు చైతన్యవీచికలుగా నిలుస్తూ అజరామరంగా ఉంటాయన్నారు. నాటక రచయిత అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, విశాలాంధ్ర జనరల్ మేనేజరు మనోహర్, అభ్యుదయ రచయితలు శరత్, రవి, కోసూరు రవి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక అపూర్వం



అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు.. (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి

సికెదిన్నె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల కలయిక ఎంతో అపూర్వమైనదని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్ రెడ్డి తెలిపారు. కడప నగరం స్థానిక రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల స్థాపించి 14 సంవత్సరాలు అయిందన్నారు. ఈ కళాశాలలో విద్యను అభ్యసించిన వారు వివిధ రంగాల్లో స్థిరపడ్డారన్నారు. వారంతా సమావేశానికి హాజరుకావడం సుభపరిణామన్నారు. రోజు రోజుకూ గురుశిష్యుల బంధం బలపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య మంచి సంబంధాలు ఉన్నప్పుడే విద్యలో రాణించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు గతస్మృతులను నెమరు వేసుకుంటూ అప్పటి అధ్యాపకులు, స్నేహితులతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ దేవీ నాగేశ్వరరెడ్డి, విభాగ అధిపతులు డాక్టర్ శశికుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రదానం పుణ్యకార్యం

వేముల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం పుణ్యకార్యం అని స్నేహిత అమృత హస్తం సేవా సమితి నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు తెలిపారు. ఆదివారం రాచకుంటపల్లెకు చెందిన మచ్చా నారాయణమ్మ నేత్రదానం చేశారు. ఆదివారం ఆమె మరణించడతో ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ రాజుకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆమె నుంచి కార్నియాలను సేకరంచినట్లు తెలిపారు. నేత్రదానాన్ని ప్రతి కుటుంబం ఒక సంప్రదాయంగా అలవర్చుకోవాలని కోరారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

● ఎంపీడీఓ



జీవీ రఘురాం, ఎంపీడీఓ, వల్లూరు

ముఖాముఖి

వల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యమని వల్లూరు ఎంపీడీఓ జీవీ రఘురాం అన్నారు. శనివారం ఆయన ఇంటర్వ్యూలో ఆ వివరాలు తెలిపారు.

ప్రశ్న: వల్లూరు మండలంలో పల్లెపండుగ కార్యక్రమం ఎలా జరుగుతోంది?

జవాబు: 14 గ్రామ పంచాయతీల్లో నిర్మాణాత్మకంగా పనులు జరుగుతున్నాయి. 46 పనులకు గాను అందులో 25 సిమెంటు రోడ్డు పనులు పూర్తయ్యాయి. మిగతావి ఈ నెలాఖరుకు పూర్తవుతాయి

ప్రశ్న: పల్లెపండుగ కార్యక్రమంలో మండలానికి ఎన్ని నిధులు వచ్చాయి? అందులో ఎన్ని సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఎన్ని?

జవాబు: రూ.2కోట్ల 36 లక్షలా 50 వేల నిధులు వచ్చాయి. అందులో 44 సిమెంటు రోడ్లు, రెండు మెటల్ రోడ్ల నిర్మాణ పనులకు నిధులు అందించారు.

ప్రశ్న: ఉపాధి పనులకు సంబంధించి 2024-25 ప్రణాళికలు రూపొందించారా.. అయితే బడ్జెట్ ఎంత?

జవాబు: ఏప్రిల్ 2024వ తేదీ నుంచి మార్చి 2025 వరకు ఉపాధి పనులకు సంబంధించి ప్రణాళికలు గ్రామసభల ద్వారా గుర్తించాం. అందులో రూ.5.61 కోట్ల పనులకు బడ్జెట్ కేటాయించాం. అందులో 2 లక్షలా 6వేల 445 పనిదినాలతో ఈ బడ్జెట్‌ను పూర్తిచేస్తాం.

ప్రశ్న: వర్షాలసీజను కదా, గ్రామాల్లో పరిశుభ్రత పనులు ఎలా నిర్వహిస్తున్నారు.

జవాబు: వర్షాల ప్రభావం వల్ల అన్ని గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రత గురించి ఇప్పటికే కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి దిశనిర్దేశాలు ఇచ్చాం. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ప్రతి రోజూ క్లోరినేషన్ చేయాలని, 15 రోజులకోసారి ట్యాంకులు శుభ్రం చేయాలని, విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నాం.

ప్రశ్న: గ్రామాల్లో వీధిలైట్లు సక్రమంగా పనిచేస్తున్నాయా.. లేదా..

జవాబు: ప్రతి గ్రామంలో వీధిలైట్లు అన్నీ పనిచేస్తున్నాయి. ఎక్కడైనా ఇబ్బందిగా ఉంటే ప్రజలు తెలియజేయాలి.

ప్రశ్న: సీజనల్ వ్యాధులు పట్ల స్థానిక ఆరోగ్య సిబ్బందితో చర్చించారా?

జవాబు: సీజనల్ వ్యాధుల పట్ల ఇప్పటికే వైద్య,ఆరోగ్య సిబ్బందితో చర్చించాం. ఆశా వర్కర్లు, ఆయాలకు తగిన సలహాలు, సూచనలు అందించాం.అవసరమైతే సచివాలయ సిబ్బందితో చర్చించాలి.

ప్రశ్న: ప్రభుత్వం చేపడుతున్న కొత్త పింఛన్లుకు అర్హతల గురించి తెలపండి.

జవాబు: వృద్ధాప్య పింఛన్లు 60ఏళ్లు దాటిన తరువాత ధ్రువీకరణ పత్రాలతో గుర్తిస్తున్నాం.సదరం క్యాంపు ద్వారా డాక్టర్లచే సిఫారసు చేసిన మంజూరు పత్రాలతో వికలత్వ పింఛన్లను అందిస్తాం.



కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

● మొక్కల పెంపకం పట్ల అభిరుచి పెరగాలి
● సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ సభ్యులు



విత్తనాల కిట్‌ను అందిస్తున్న సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ సభ్యులు కుసుమారెడ్డి, కిరణ్, అలేఖ్య సుప్రియ పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం పట్ల అభిరుచి పెరగాలని తెలిపారు. ఆదివారం కడప నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో టెర్రస్ గార్డెన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉచితంగా సీడ్స్ కిట్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, పచ్చదనం అభివృద్ధికి తోడ్పడాలన్నారు. మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భౌతిక వనరుల వినియోగాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. పిల్లలు, పెద్దలు మొక్కల పెంపకం పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. మొక్కల ద్వారా విజ్ఞానం పెంచుకుని ఆనందం, ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు. అనంతరం 15 రకాల కూరగాయల విత్తనాల కిట్‌ను ఉచితంగా అందించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు షకీలా, గోవిందరెడ్డి, పర్యావరణమిత్ర సమూహం సభ్యులు భరత్‌కుమార్, పుష్పరాజ్, శివ, భాస్కర్ పాల్గొన్నారు.

నేడు మల్లేలమ్మ వార్షికోత్సవం

వేంపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో కొలువైన మల్లేలమ్మ తల్లి వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులందరు వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు సీపీఐ ఆధ్వర్యంలో నిరసన

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లంచాలు, అవినీతి అక్రమాలతో ఆదాని, జగన్ చేసుకున్న విద్యుత్ ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని సోమవారం నిరసన చేపట్టనున్నట్లు సీపీఐ కడప నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిరసన కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహిస్తామని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



పులివెందుల శిల్పారామంలో నృత్యం చేస్తున్న చిన్నారులు



పులివెందుల శిల్పారామంలో ఆదివారం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణలో శ్రీరాజా కళానిలయం చిన్నారులు శాస్త్రీయ, సినిమా పాటలకు నృత్యం చేశారు. 'ఓ పిలగా యంకటేశు, చెప్పవే చిరుగాలి.. చల్లగా ఎదగిల్లి, చుట్టమల్లే చుట్టేస్తుంది' తదితర పాటలకు చిన్నారులు వేసిన స్టెప్పులకు ప్రేక్షకుల ఈలలు, కేకలతో శిల్పారామం మార్మోగింది.

-పులివెందులరూరల్, (ఆంధ్రజ్యోతి)





భగవద్గీత శ్లోక పోటీ విజేతలకు బహుమతులు

కడప కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గీతా జయంతిని పురస్కరించుకుని తిరుమల-తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక హౌసింగ్ బోర్డుకాలనీలోని కోదండ రామాలయంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత కంఠస్త పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో 6,7 తరగతుల విభాగంలో క్రిష్ణంహర్షిణి, నితీష్, 8,9 తరగతుల విభాగంలో వన్సిక, చిన్మయి ప్రథమ, ద్వితీయ విజేతలుగా నిలిచారు. సంపూర్ణ భగవద్గీత 18 సంవత్సరాల్లోపు విభాగంలో సుకృత్, మేధాశ్రీ సాయికృతి విజేతలుగా నిలిచారు. అలాగే 18 సంవత్సరాలకు పైబడిన వారి విభాగంలో జ్యోతి, కె.జ్యోతి ప్రథమ, ద్వితీయ విజేతలుగా నిలిచారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా రిటైర్డ్ ప్రధాన ఆచార్యులు వెంకటసుబ్బారెడ్డి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, వెంకటరమణ, క్రిష్ణగీత, క్రిష్ణమోహన్, శ్రీదేవి, శ్యామలమ్మ వ్యవహరించారు. ప్రథమ విజేతకు రూ.1000, ద్వితీయ విజేతకు రూ.750, తృతీయ విజేతకు రూ.500 బహుమతిగా అందించారు.

ప్రభాకర్‌కు కామధేను జాతీయ పురస్కారం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రచయిత డాక్టర్ ప్రభాకర్ కామదేను జాతీయ పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. హైదరాబాదు టూరిజం ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో విశ్వగురువు వరల్డ్ రికార్డ్స్ ఈ పురష్కారాన్ని ప్రదానం చేసింది. 35 విభాగాల్లో ప్రధానం చేయగా రచనా విభాగంలో డాక్టర్ ప్రభాకర్‌కు తెలంగాణా న్యాయమూర్తి నూరేపల్లి నంద విశ్వగురువు వరల్డ్‌రికార్డ్స్ సీఈవో సత్యవోలు రాంబాబు అందజేశారు.



కడప నగరం విజయదుర్గ ఆలయంలో ఆదివారం నిర్వహించిన విజయదుర్గామల్లికార్జునుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

అధ్వాన రోడ్లకు మోక్షమెన్నడో..?

జమ్మలమడుగు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు ఛిద్రమై గుంతలు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా జమ్మలమడుగులోని కన్నెలూరు ఎస్సీ కాలనీ శివార్లలో రోడ్డు గుంతలు పడి ఆపై వర్షపునీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నారు. మోరగుడిలోని కోవెలకుంట్ల వెళ్లే దారి కుండా రామయ్య విగ్రహం మలుపు వద్ద ప్రధాన రోడ్డులో గుంతలు పడి ఆ పై వర్షపునీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయి. మైలవరం వెళ్లే దారిలో శ్రీరాములపేట కాలువ పక్కన రోడ్డు పొడవునా గుంతలు దర్శనమిస్తున్నాయి. ఆ దారిలో ప్రతిరోజు ఏదో ఒక సమయంలో ద్విచక్ర వాహనదారులు పడి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నుంచి బైపాస్‌రోడ్డు వెళ్లే దారి ఛిద్రమైంది. అలాగే బైపాస్‌రోడ్డులో పలుచోట్ల రోడ్డు గుంతలు పడ్డాయి. అలాగే ముద్దనూరు రోడ్డులోని సున్నపురాళ్లపల్లెకు వెళ్లే దారి దారుణంగా మారింది. అలాగే జమ్మలమడుగు మండలంలోని శేషారెడ్డిపల్లె వెళ్లే దారి రోడ్డు గుంతలు దర్శనమిస్తున్నాయి. అక్కడి నుంచి పొలాల దారిలో గొరిగెనూరు, ప్రొద్దుటూరుకు వెళ్లే రోడ్డులోకి కలుస్తోంది. ఆ రోడ్డు కంకర బయటపడి ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయపడుతున్నారు. అలాగే ధర్మాపురం గ్రామం నుంచి ప్రొద్దుటూరు వెళ్లే రోడ్డుకు వచ్చే దారి సిమెంటు రోడ్డు నెర్రలుచీలింది. ఇలాగే మరికొన్ని ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిని ఉన్నాయి. సంబంధిత అధికారులు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి రోడ్లు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో గ్రామీణ, ప్రధాన రోడ్లు నిర్లక్ష్యానికి గురయ్యాయి. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్లకు మోక్షం వస్తుందని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.





చిన్నపసుపుల-ఎస్.ఉప్పలపాడు దారి, శేషారెడ్డిపల్లె, గొరిగెనూరు గ్రామాల మధ్య అధ్వాన రోడ్డు



కోనాపురం ఉప్పలూరులో మధ్యలో దెబ్బతిన్న రోడ్డు

ఈ రోడ్డులో నరకప్రయాణం

ముద్దనూరు డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. జగన్ ప్రభుత్వం రహదారులను గాలికి వదిలేసింది.దీంతో రోడ్లకు గుంతలు పడి ప్రమాదకరంగా ఉన్నాయి.ముద్దనూరు మండలంలో అతి పెద్దగ్రామం ఉప్పలూరు. ఈ గ్రామం నుంచి మాదన్నగారిపల్లె పంచాయతీ మీదుగా ఎర్రగుంట్ల మండలం చిలమకూరు వద్ద కడప ,తాడిపత్రి హైవే రోడ్డుకు దాదాపు 15 కిలోమీటర దూరం ఉంటుంది.ఉప్పలూరు, కొలవలి గ్రామ పంచాయతీల ప్రజలు కడప,ప్రొద్దుటూరుకు వెళ్లాలంటే ఈ దారి గుండా ప్రయాణిస్తుంటారు.తారు రోడ్డు అంతా పూర్తిగా దెబ్బతింది.పెద్ద,పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు గుంతలు తప్పించేందుకు వీలులేకుండా భారీగా దెబ్బతింది రోడ్డు.కోనాపురం వద్ద నడిఊరులో ఇళ్ల ముందు భారీ గుంతలు ఉన్నాయి. వర్షం పడితే నీరు గుంతల్లో నిల్వ ఉంటుంది. దీంతో వాహనాలు గుంతలో పడితే బురద ఇళ్లలోకి పడుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లకు మోక్షం వస్తుందాఅని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

సోలార్ మోడల్ విలేజ్‌పై అవగాహన సదస్సు

ప్రొద్దుటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సోలార్ మోడల్ విలేజ్‌పై సోమవారం మండల పరిధిలోని గోపవరం పంచాయతీలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఉదయం 10.30 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఈఈ రమణారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

కేజీబీవీ ఉద్యోగులకు ఎంటీఎస్ అమలు చేయాలి

పోరుమామిళ్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు వెంటనే ఎంటీఎస్ అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలరు చంద్రహాసరెడ్డి, రీజనల్ కన్వీనరు క్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పోరుమామిళ్లలోని ఎస్టీయూ భవనంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కడప ఉక్కు పరిశ్రమకు పోరాడాలి

బద్వేలు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) : కడప ఉక్కుపై రాజకీయ పార్టీలు స్పష్టమైన వైఖరి తెలపాలని ప్రజా ఉద్యమాలతో కలిసి రావాలని పార్లమెంటు సమావేశాలలో ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. కడప ఉక్కు విభజన చట్టంలో చట్టబద్ధతగా రాసుకున్నా వాటి అమలుకు కేంద్రం ముందుకు అడుగులు పడడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్,షరీఫ్ పాల్గొన్నారు.

ఆవోపా నూతన కమిటీ ఎన్నిక

బద్వేలు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి) :ఆవోపా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు స్టేట్ రీజనల్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారావు తెలిపారు. ఆవోపా జిల్లా కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీధర్, సెక్రటరీగాపత్తి రాఘవేంద్రరావు, జాయింట్ సెక్రటరీ వేణుగోపాల్, ఈసీమెంబర్ వెంకటరమణ, సత్యనారాయణను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు నూకల రెడ్డెయ్య, సెక్రటరీ సివి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై వైసీపీ నేత దాడి

ప్రొద్దుటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):ప్రొద్దుటూరు మునిసిపాలిటీ పరిధిలోని 25వార్డు రేషన్‌డీలర్ దాదాఖలందర్‌పై స్థానిక వైసీపీ వార్డు ఇన్‌చార్జి నూర్ మహ్మద్ అలియాస్ నూరి దాడి చేసినట్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో తనకున్న రేషన్‌షాప్‌ను వైసీపీ ప్రభుత్వంలో నూర్‌మహ్మద్ రాజకీయ సిఫారస్‌తో దక్కించుకున్నాడు. తిరిగి టీడీపీ వచ్చిన తర్వాత తన షాప్ తనకు అధికారులు ఇవ్వడంతో దానిని జీర్ణించుకోలేని నూరి తనపై ఉద్దేశ పూర్వకంగా దాడి చేసినట్లు దాదాఖలందర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. నూరితో పాటు మరో ఇద్దరు కలిసి దాడి చేసినట్లు తెలిపారు.ఆమేరకు వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డి కేసునమోదు చేసినట్లు తెలిపారు.

పబ్లిక్ నోటీసు

నా కక్షిదారులైన ప్రొద్దుటూరుకు చెందిన పోలేపల్లి కృష్ణమూర్తిగారికుమారులు 1)సుబ్బారావు 2) రాధాకృష్ణ, 3) వేణు 4) సురేష్ గార్ల వలన సరియైన ఇన్‌స్ట్రక్షన్స్ తీసుకొని ఇచ్చు పబ్లిక్ నోటీసు ఏమనగా ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని గురించి నా కక్షిదా రులకు 30% భాగం ఉన్నదని ప్రొద్దుటూరుకు చెందిన శ్రీ మిట్టా వెంకటేశ్వరరావుగారితో తగాదా పడుతున్నారు. దాని గురించి రాజశ్రీ ప్రొదుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు ఓ.ఎస్.నెం. 175/2009 దావా దాఖలు అయ్యి 20-11-2024వ తేదీన సదరు కోర్టువారు ఇచ్చిన జడ్జిమెంటుపైన నా కక్షిదారులు అప్పీలు దాఖలు చేసుకుంటున్నారు. కాబట్టి దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని గురించి ఎవ్వరేగాని ఎటువంటి క్రయవిక్రయాలు జరుపకూడదు అవి చెల్లనేరవు. వాటి పైన, వారిపైన సరియైన చట్టపరమైన చర్యలు తీసుకొనబడును.

షెడ్యూలు : Landed Properties situated in Proddatur Reg. district, Proddatur Sub Reg. District in the Panchayath of Kothapalli in the village of fields of Modameedhipalli 1) Govt. Dry S.No. 111-2A Pyki Extent Ac. 0.53 1/2 Cents or 0.216 Hec. Bounded by : East : Land of Nagumalla Subbanna, West : Land of Vallamkondu Adi Narayana Guptha now in the hands of Vundela Venkata Reddy and Chemikala Jaya Lakshumma etc., North : Land of Sunku Subba Rao, South : Item No.2 of Plaint Schedule. With all easement Rights, 2) Govt. Dry S.No. 111-2B Pyki Extent Ac. 55 Cents or 0.223 Hec. Pura.

ఇట్లు, వి.రమేష్‌బాబు, అడ్వకేట్, 8/581, గిడ్డంగి వీధి, ప్రొద్దుటూరు. సెల్ : 94415 00950

విశ్వబ్రాహ్మణుల్లో రాజకీయ చైతన్యం రావాలి



మాట్లాడుతున్న చంద్రమౌళి

జమ్మలమడుగు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణుల్లో రాజకీయ చైతన్యం రావాలని పలువురు సూచించారు. ఆదివారం జమ్మలమడుగు పట్టణంలోని డాక్టర్ ఎంపీ మునిరెడ్డి కాలనీలో విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ అభ్యుదయ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలు ప్రాంతాల నుంచి విశ్వబ్రాహ్మణులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో సుమారు 25 లక్షలు, దేశ జనాభాలో సుమారు 11 కోట్ల మంది విశ్వబ్రాహ్మణులు ఉన్నారన్నారు. అనంతరం బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు తదితరులు ప్రసంగించారు ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నాగేంద్ర ఆచారి, లక్ష్మయ్య, వీరభద్ర, రామాచారి, నాగార్జున, బాలక్రిష్ణ, పలువురు విశ్వబ్రాహ్మణుల మహిళలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న గాలి చంద్ర

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ గ్రూపుల్లో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గాల సీపీఐ శాఖల కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన ముడి ఖనిజాలు అపారంగా ఉన్నా ప్రభుత్వాలు పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపడంలేదని విమర్శించారు. చెన్నూరు చెక్కర కర్మాగారం, ప్రొద్దుటూరు పాల కర్మాగారం, పెన్నార్ పేపర్ మిల్లులను ప్రభుత్వాలు ఉద్దేశ్య పూర్వకంగానే మూత వేశాయన్నారు. ప్రైవేటు రంగంలో ఉన్న స్పిన్నింగ్‌మిల్లులు, రసాయన పరిశ్రమలు, ఆయిల్ మిల్లులు అనేకం మూతపడ్డాయని పేర్కొన్నారు. కడప-బెంగళూరు రైల్వేమార్గం పనులు అర్ధంతరంగా ఆగిపోయాయని, గండికోట, బ్రహ్మంసాగర్, సిద్దవటం, ఒంటిమిట్ట టూరిజం కారిడార్ పనులు అమలు కావడం లేదన్నారు. కడప ఐటీబార్, మైలవరం అపెరల్‌పార్కు ఊసేలేదని, మహిళా డెయిరీ అటకెక్కిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామయ్య, శ్రీరాములు, పార్టీ నాయకులు భాస్కర్, చంద్రశేఖర్, హరి, ప్రమీళ, శరత్, షేక్షావలి, యేసోబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

జమ్మలమడుగు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పెన్షనర్స్ అసోసియేషన్, అభిలాష్ నేత్రవైద్యశాల ఆధ్వర్యంలో మానవతా సేవా సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో రోగులకు ఉచితంగా వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంఎల్‌నారాయణరెడ్డి,పెన్షనర్స్ అధ్యక్షుడు దేవదానం , డాక్టర్ నాగేశ్వరరెడ్డి, మాధవ గోపాల్‌రెడ్డి, పార్థసారధి, మానవతా సేవా సంస్థ జనరల్ సెక్రటరి, గౌరవ సభ్యులు ఓబుళరెడ్డి, విశ్రాంత ఎంఈవో మస్తాన్‌రెడ్డి, సంజీవరాయుడు, రామచంద్రారెడ్డి, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లిం సమాజానికి తీరని అన్యాయం



మాట్లాడుతున్న టీడీపీ మైనారిటీ నాయకులు

ప్రొద్దుటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ చట్టం పేరుతో ముస్లిం సమాజానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని ముస్లిం మేధావులు విమర్శించారు. ఆదివారం షాదీ మంజిల్‌లో వక్ఫ్ బోర్డు సవరణ చట్టం పై ముస్లిం పెద్దలు, మేధావులు ప్రజా ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంజరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ చట్టంలోని 44 అంశాలలో 6 అంశాలను ముస్లిం సమాజం తీవ్ర ంగా అభ్యంతర పెడుతున్నదన్నారు. ముస్లింలను దెబ్బతీసే కుట్ర ఈ సవరణ చట్టంలోవుందని దీనిపై తీవ్రంగా అభ్యంతర పెడుతున్నామన్నారు. కార్యక్రమంలో ముస్లిం మేధావుల ఫోరం అధ్యక్షుడు ఖాజామొహిద్దీన్ ఫరీద్ కౌన్సిల్లర్లు కమాల్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన భూపేశ్‌రెడ్డి



జమ్మలమడుగు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీలోని పలగాడి వీధిలో మసీదు దగ్గర హజరత్ సయ్యద్‌షా రఫీవుల్లా ఖాద్రీ స్వామి దర్గాను ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సందర్శించారు. ఆహ్వానం మేరకు ఆయన దర్గా వెళ్లగా కమిటీవారు ఘనంగా సన్మానం చేశారు. అనంతరం రఫీవుల్లా ఖాద్రీ దర్గాలో భూపేశ్‌రెడ్డి ప్రత్యేక ఫాతెహాలు చేసి మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమెర్ల జాకీర్, సంజీవ, దర్గా కమిటీవారు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌కు ఘన సన్మానం



బద్వేలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పరిటాల వెంకటసుబ్బయ్యను ఆదివారం ఆవోపా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అమ్మవారిశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆవోపా కమిటీ సభ్యులు ఆర్యవైశ్యుల సమస్యలను తెలిపి వాటి పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్యులు పాల్గొని ఆయనకు తమ అభినందనలు తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలన


ప్రొద్దుటూరు డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గ్రామాల రైతులు భూసమస్యల పరిష్కారం కోసం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితను కలిసి విన్న వించవచ్చని తహసీల్దారువండాడి గంగయ్య తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని దొరసానిపల్లెలో సోమవారం జరగబోయే మంత్రి సవిత పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించడానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం దొరసానిపల్లెలో జరిగే రెవిన్యూ సదస్సుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవిత హాజరవుతున్నారన్నారు. కేవలం దొరసానిపల్లె భూసమస్యలే కాకుండా మండల పరిధిలోని మేజర్ రెవెన్యూ విలేజ్‌ల భూములకు సంబంధించిన సమస్యలుంటే రైతులు మంత్రి దృష్టికి తీసుకురావచ్చన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామికి పూజలు

ఖాజీపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీతానగరం గ్రామంలో అయ్యప్పస్వామికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి మెట్లపూజ నిర్వహించడంతో గ్రామం అంతా అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగింది. అనంతరం అయ్యప్పస్వాములకు, గ్రామస్థులకు భిక్ష ఏర్పాటు చేశారు

‘ఉపాధి’తో చేయూత

జగదీశ్వర్‌రెడ్డి, ఉపాధి హామీ ఏపీవో



ముఖాముఖి

చాపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ కూలీలకు, పేదలకు ఆర్థికంగా చేయూత ఇస్తుందని ఏపీవో జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. వారిలో కొనుగోలు శక్తి పెరిగింది. కూలీలు సొంత గ్రామం నుంచి పనుల కోసం ఇతర గ్రామాలకు వలసలు చాలా వరకు తగ్గాయి. తల్లిదండ్రులు వారి పిల్లల చదువులకు జూన్ నెల పాఠశాలలు ప్రారంభం అయ్యేనాటికి ఒక్కొక్కరికి సుమారు రూ.25 వేలు కూలీలు సంపాదించుకుంటున్నారు. ఇప్పుడు అప్పులు చేయడం చాలా మంది తగ్గించుకున్నారు. ఉపాధి హామీ పథకం ఏపీవో జగదీశ్వర్ రెడ్డి తో ప్రత్యేక ఇంటర్వ్యూ

ప్రశ్న: మండలంలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి.

జవాబు: 6,911.

ప్రశ్న:ఎంతమంది ఫీల్డ్‌అసిస్టెంట్లుఉన్నారు.

జవాబు: 22 మంది.

ప్రశ్న: ఎన్ని గ్రామాలు ఉన్నాయి.

జవాబు: 22 గ్రామాలు.

ప్రశ్న: 2024-25 సంవత్సరానికి ఎంత బడ్జెట్ ప్రతిపాదించారు.

జవాబు: రూ.6.67 కోట్లు.

ప్రశ్న: మొత్తం ఎంత మంది కూలీలు ఉన్నారు.

జవాబు: 7,743 మంది.

ప్రశ్న: పనులకు ఎన్ని కుటుంబాలవారు వస్తున్నారు.

జవాబు: 4,680 కుటుంబాలు.

ప్రశ్న: ఒక్కొక్క కూలీ రోజుకు ఎంత డబ్బు సంపాదిస్తున్నారు.

జవాబు: రూ.254.

ప్రశ్న: కూలీలు ఎలాంటి పనులు చేస్తున్నారు.

జవాబు: చెక్‌డ్యాంలు, చెరువుల్లో మట్టి పూడిక తీస్తున్నారు. కందకాలు తవ్వుతున్నారు. కాలువలు తయారు చేస్తున్నారు.

ప్రశ్న: రైతులు పండ్ల తోటలు ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు.

జవాబు: 32 ఎకరాలు.

ప్రశ్న: ఎకరాకు రైతులకు ఎంత సబ్సిడీ ఇస్తున్నారు.

జవాబు: రూ.70 వేల నుంచి రూ.1.30 లక్షల వరకు ఇస్తున్నాం.

ప్రశ్న: వేసవిలో కూలీలకు ఎండ నుంచి ఎలాంటి రక్షణ కల్పిస్తున్నారు.

జవాబు: నీడకోసం టార్పాలిన్ పట్టలు ఇస్తున్నాం.

ప్రశ్న: ప్రతి ఏడాది ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నారా?

జవాబు: నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: ఎన్ని పనిదినాలు కల్పిస్తున్నారు.

జవాబు: 2.22 లక్షలు.


రచయిత ప్రభాకర్‌కు కామధేను జాతీయ పురస్కారం



ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రచయిత డాక్టర్ ప్రభాకర్ కామధేను జాతీయ పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. హైదరాబాదు టూరిజం ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో విశ్వగురువు వరల్డ్ రికార్డ్స్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. 35 విభాగాల్లో ప్రధానం చేయగా రచనా విభాగంలో డాక్టర్ ప్రభాకర్‌కు తెలంగాణా న్యాయమూర్తి సూరేపల్లి నంద విశ్వగురువు వరల్డ్‌రికార్డ్స్ సీఈవో సత్యవోలు రాంబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో సినీ సంగీత దర్శకురాలు శ్రీలేఖ, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

4వ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు

జమ్మలమడుగు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు, సభ్యులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా జమ్మలమడుగు తాలూకా కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక ఎన్నికల అధికారి కె.రమణ తదితరుల ఆధ్వర్యంలో జరిగింది. అందులో ఏడు గురు అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. అధ్యక్షుడుగా ఎస్.యథార్థుడు, జలవనరుల శాఖ డిపార్టుమెంట్ ఉపాధ్యక్షులుగా జి.రామాంజనేయులు, దానప్ప, కార్యదర్శి నాయక్, సంయుక్త కార్యదర్శి వలివరాజు, జె.చంద్రశేఖర్, కోశాధికారి లాజర్ (ఆర్అండ్‌బీశాఖ), ఆర్గనైజర్ శ్రీను (రెవెన్యూశాఖ) మెంబర్లుగా సిద్ధార్థ, క్రిష్ణారెడ్డి, లావణ్య, మధు, తదితరులు ఎన్నికైనట్లు తెలిపారు.



రిజర్వేషన్ల కోసం పోరాడకుంటే బీసీలకు భవిష్యత్తులేదు



ప్రొద్దుటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మేమెంతో మాకంత అనే నినాదంతో రిజర్వేషన్లకోసం పోరాడకుంటే బీసీలకు భవిష్యత్తు లేదని బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు పిలుపు నిచ్చారు. ఆదివారం జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని అలంకార్ ఫంక్షన్ హాలులో బీసీ ప్రజా చైతన్య సమాఖ్య మహాసభ జరిగింది. ఈ సభలో బొర్రా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో వున్న 34 శాతం రిజర్వేషన్ తొలగించి బీసీలకు అన్యాయం చేసిందన్నారు. బీసీ ప్రజా చైతన్య సమాఖ్య 2010 నుంచి ప్రొద్దుటూరు బీసీలను సంఘటితం చేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కుల గణన చేయకుండా మనకు రాజకీయ రిజర్వేషన్లు పొందలేమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యమ నాయకుడు డాక్టర్ మల్లెల భాస్కర్ మాట్లాడారు. మహా సభ అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడుగా బొర్రా రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా రిటైర్డ్ తెలుగుపండిట్ చాబోలి దేవేంద్రుడు, కోశాధికారిగా మడకా సంటెన్న ఉపాధ్యక్షులుగా వేల్పుల భాస్కర్, కొత్తపల్లి శ్రీను,సుంకర వేణు, జీసీ పుల్లయ్య, కార్యదర్శులుగా భాస్కరరావు, పోసా ఆదినారాయణ, సహాయ కార్యదర్శులుగా తులపాకుల చౌడయ్య, హనుమంత్ కారి పరమేశ్వరరావు, గౌరవ సలహాదారులుగా ఆరుగురిని కార్యవర్గ సభ్యులును ఎన్నుకున్నారు.